


www.vibharenews.com

# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY



ఆవుల పుల్లారెడ్డి సేవా సమితి

రి.నెం. 119/2015

ఆళ్ళగడ్డ, కర్నూలు జిల్లా

ఉచిత కళ్యాణ మండపం | స్వయం ఉపాధి శిక్షణ

ఉచిత రక్తదానము | ఉచిత న్యాయ సలహాలు

ఉచిత కంప్యూటర్ శిక్షణ

సంప్రదించవలసిన చిరునామా

ఆవుల విజయభాస్కర రెడ్డి B.A.LL.B

ఆళ్లగడ్డ

9440232308,9494498787



PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి శుక్రవారం 10-03-2023 సంపుటి : 04 సంచిక : 171 పేజీలు : 4 వెల : రూ 3-00


# అంబేద్కర్ స్మృతివనం ప్రాజెక్టు పనుల్లో నాణ్యత పాటించాలి: సీఎం జగన్



తాడేపల్లి: విజయవాడలో అంబేద్కర్ భారీ విగ్రహం, స్మృతివనం పనులపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం సమీక్ష నిర్వహించారు.స్మృతివనంతో పాటు విగ్రహం నిర్మాణ పనులపై సీఎంకు అధికారులు వివరాలు అందించారు. స్మృతివనం ప్రాంగణంలో పనులు చురుగ్గా జరుగుతున్నాయన్న అధికారులు.. అన్ని స్లాబ్ వర్కులు ఈ నెలాఖరు నాటికి పూర్తవుతాయని తెలిపారు.ప్రాంగణంలో ఒక కన్వెన్షన్ సెంటర్ కూడా వస్తుందని, విగ్రహ విడిభాగాలు ఇప్పటికే సిద్ధంగా ఉన్నాయని, ఒక్కొక్కటిగా అమర్చుకుంటూ మొత్తం 13 దశల్లో విగ్రహ నిర్మాణాన్ని పూర్తిచేస్తామని అధికారులు వివరించారు. విగ్రహ నిర్మాణంలో 352 మెట్రిక్ టన్నుల ఉక్కు, 112 మెట్రిక్ టన్నుల ఇత్తడిని వినియోగిస్తున్నామని అధికారులు పేర్కొన్నారు. విగ్రహం తయారీతో పాటు దాని చుట్టూ సివిల్ వర్క్స్, సుందరీకరణ, మైదానాన్ని ప్రధాన రహదారితో అనుసంధానం చేసే పనులను అధికారులు.. సీఎంకు వివరించారు.అంబేద్కర్ స్మృతివనం ప్రాజెక్టు శాశ్వతమైన ప్రాజెక్టు అని, పనులు కూడా అంతే నాణ్యతతో ఉండాలని సీఎం జగన్ అన్నారు. "విజయవాడకు ప్రత్యేక గుర్తింపును తీసుకువచ్చేలా నిర్మాణాలు ఉండాలి. స్మృతివనంలో ఏర్పాటవుతున్న కన్వెన్షన్ సెంటర్‌కూడా అత్యంత ప్రధానమైనది. నిర్మాణంలో నాణ్యతతో పాటు, సుందరీకరణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి. అధికారులు పనులను సమన్వయం చేసుకుని ముందుకు సాగాలి. పనుల పర్యవేక్షణకోసం ఏర్పాటు చేసిన ఉన్నతస్థాయి కమిటీ ఎప్పటికప్పుడు సమీక్షించుకోవాలి" అని సీఎం జగన్ సూచించారు.

# పాక్ కవ్వింపు చర్యలను.. మోదీ చూస్తూ ఊరుకోరు: యూఎస్ నివేదిక



దిల్లీ: సరిహద్దు ఉద్రిక్తతలపై భారత్ ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో గతంలో కంటే దీటుగా సైనిక శక్తితో ప్రతిస్పందించగలదని అమెరికన్ ఇంటిలిజెన్స్ కమ్యూనిటీఅభిప్రాయపడింది .భారత్-పాకిస్థాన్ భారత్-చైనా మధ్య పెరుగుతున్న ఉద్రిక్తతలు నేపథ్యంలో ఘర్షణలకు అవకాశం ఉందని అంచనా వేసింది. యూఎస్ కాంగ్రెస్‌కు సమర్పించిన నివేదికలో భాగంగా ఈ ముప్పు అంచనాలు వెలువరించింది.'సరిహద్దు సమస్యను పరిష్కరించుకునేందుకు భారత్, చైనా ద్వైపాక్షిక చర్చలు జరుతున్నాయి. కానీ, 2020లో జరిగిన గల్వాన్ ఘర్షణతో ఇరు దేశాల మధ్య సంబంధాలు దారుణంగా దెబ్బతిన్నాయి. సరిహద్దు వద్ద పెరిగిన సైనిక మోహరింపులు ఈ అణుశక్తుల మధ్య ఘర్షణ ప్రమాదాన్ని పెంచుతున్నాయి. అది యూఎస్ ప్రయోజనాలకు ముప్పుగా మారవచ్చు' అని ఆ నివేదిక పేర్కొంది. ఈ విషయంలో యూఎస్ జోక్యానికి పిలుపునిచ్చింది. గతంలోని సంక్షోభాలను బట్టి చూస్తే.. వాస్తవాధీన రేఖ వద్ద స్వల్ప స్థాయి ఆకస్మిక ఘర్షణలు అవకాశం ఉండొచ్చని తెలిపింది.అలాగే భారత్, పాకిస్థాన్ మధ్య ఉన్న ఉద్రిక్త పరిస్థితులపై కూడా ఆందోళన వ్యక్తం చేసింది. 'భారత్ వ్యతిరేక మిలిటెంట్ గ్రూపులకు మద్దతు ఇచ్చిన చరిత్ర పాకిస్థాన్‌కు ఉంది. పాక్ రెచ్చగొట్టే చర్యలకు మోదీ నాయకత్వంలోని భారత్ గతంలో కంటే దీటుగా సైనికశక్తితో స్పందించగలదు. కశ్మీర్‌లో అశాంతి వంటి అంశాలు ఈ అణ్వాయుధ దేశాల మధ్య ఉద్రికత్తలను పెంచుతున్నాయి' అని ఆ నివేదిక పేర్కొంది. అయితే 2021 ప్రారంభంలో నియంత్రణ రేఖ వద్ద కాల్పుల విరమణ ఒప్పందం పునరుద్ధరణ ఇరు దేశాల మధ్య శాంతియుత పరిస్థితులకు దోహదం చేయొచ్చని అంచనావేసింది.

# సీఎం జగన్ మాటల్లో కాదు.. చేతల్లో చూపిస్తున్నారు: సజ్జల



అమరావతి: దేశంలో ఎక్కడా లేని విధంగా ఏపీలో సామాజిక న్యాయం జరుగుతుందని ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు.ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు గురువారం నామినేషన్లు దాఖలు చేశారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థులుగా పెనుమత్స సురేష్, కోలా గురువులు, ఇజ్రాయిల్, మర్రి రాజశేఖర్, జయమంగళ వెంకట రమణ, పోతుల సునీత, చంద్రగిరి యేసురత్నం నామినేషన్లు వేశారు.ఈ సందర్భంగా సజ్జల మాట్లాడుతూ, గత ప్రభుత్వం మాటలకే పరిమితమైందన్నారు. చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు బీసీలకు ఎందుకు ఇన్ని అవకాశాలు ఇవ్వలేదని ఆయన ప్రశ్నించారు. "సీఎం జగన్ సామాజిక సాధికారతను చేతల్లో చూపుతున్నారు.. మూడున్నరేళ్లలో సీఎం జగన్ సామాజిక విప్లవం తీసుకొచ్చారు" అని సజ్జల అన్నారు."18 ఎమ్మెల్సీ స్థానాల్లో 14 స్థానాలు బీసీ, ఎస్సీ, ఎస్టీలకు కేటాయించాం. అందులో 11 స్థానాలు బీసీలకు కేటాయించడం చరిత్రాత్మకం. రాజకీయ సాధికారత దిశగా సీఎం జగన్ ముందుకు వెళ్తున్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు సీఎం జగన్ పెద్దపీట వేస్తున్నారు" అని సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు.

# ఈ వేసవిలో విద్యుత్ కోతలు లేకుండా చర్యలు: విజయానంద్

విజయవాడ: ఈ వేసవిలో విద్యుత్ కోతలు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి విజయానంద్ అన్నారు.గురువారం ఆయన సాక్షి మీడియాతో మాట్లాడుతూ, వేసవిలో విద్యుత్ కోతలు లేకుండా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశించారని తెలిపారు. సీఎం ఆదేశాలతో ప్రణాళికాబద్ధంగా వేసవి డిమాండ్‌ని అధిగమిస్తామన్నారు."గత ఏడాది కంటే ఈ వేసవిలో విద్యుత్ డిమాండ్ ఎక్కువగా ఉంది. గత ఏడాది ఫిబ్రవరిలో సరాసరిన రోజుకి 202 మిలియన్ యూనిట్ల డిమాండ్ ఉంటే ఈ ఏడాది ఫిబ్రవరిలోనే 227 మిలియన్ యూనిట్లకి పెరిగింది. గత ఏడాది మార్చి నెలలో రోజుకి 212 మిలియన్ యూనిడ్ల డిమాండ్ ఉంటే ఇపుడు 232 మిలియన్ యూనిట్లకి డిమాండ్ పెరిగింది. గత ఏడాది ఏప్రిల్ నెలలో పీక్ డిమాండ్ 232 మిలియన్ యూనిట్ల కాగా.. ఈ ఏడాది మార్చి రెండవ వారంలోపే 232 మిలియన్ యూనిట్లు దాటాం. గడిచిన



ఏడాది కాలంలో ఏపీలో పెరిగిన పరిశ్రమల కారణంగా వాణిజ్య అవసరాలకి 18 శాతం, పరిశ్రమలకి 20.31 శాతం విద్యుత్ వినియోగం పెరిగింది" అని విజయానంద్ వివరించారు."ఈ కారణంగానే విద్యుత్ డిమాండ్ ఊహించని విధంగా రికార్డు స్థాయికి పెరిగింది. మార్చి నెలాఖరుకి 240 మిలియన్ యూనిట్లు.. ఏప్రిల్ నెలకి 250 మిలియన్ యూనిట్లకి డిమాండ్ పెరుగుతుందని అంచనా వేస్తున్నాం. ఏప్రిల్ నెలలో ఒక్క వ్యవసాయానికే సరాసరిన 50 మిలియన్ యూనిట్ల విద్యుత్ డిమాండ్ ఉంటుంది. పెరిగిన డిమాండ్ కి తగ్గట్లుగా విద్యుత్ కోతలు లేకుండా చర్యలు చేపడుతున్నాం. పరిశ్రమలకి, గృహావసరాలకి నిరంతరాయ విద్యుత్ సరఫరా ఉంటుంది. వ్యవసాయానికి 9 గంటల విద్యుత్ సరఫారా కొనసాగిస్తాం" అని ఆయన తెలిపారు.

# తీవ్రమైన చర్యలు తీసుకోకుండా సీబీఐని ఆదేశించండి.. అవినాష్‌రెడ్డి పిటిషన్



హైదరాబాద్: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్యకేసులో రేపు ఉదయం 11 గంటలకు సీబీఐ ఎదుట విచారణకు కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి హాజరు కావాల్సి ఉంది.ఈ నేపథ్యంలో ఆయన తెలంగాణ హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. తనను సీబీఐ అధికారులు విచారించే సమయంలో ఆడియో, వీడియో చిత్రీకరణ జరిపేలా ఆదేశించాలని పిటిషన్‌లో కోరారు. విచారణ సందర్భంగా తనతో పాటు న్యాయవాదిని కూడా అనుమతించాలని, సీబీఐ నమోదు చేసిన వాంగ్మూలం ప్రతిని ఇచ్చేలా ఆదేశించాలని కోరారు. తీవ్రమైన చర్యలు తీసుకోకుండా సీబీఐని ఆదేశించాలని అవినాష్‌రెడ్డి పిటిషన్‌లో పేర్కొన్నారు.

# వైద్యులు,ఆసుపత్రుల పై దాడులు చేస్తే కఠిన చర్యలు

## రాష్ట డి జి పి రాజేంద్ర నాథ్ రెడ్డి

విజయవాడ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ రవి కృష్ణ, ప్రధాకార్యదర్శి డాక్టర్ ఫణిధర్,కోశాధికారి డాక్టర్ రవీంద్ర నాథ్ లు రాష్ట్ర డిజిపి రాజేంద్ర నాథ్ రెడ్డిని మంగళగిరి కార్యాలయంలో కలిసి రాష్ట్రంలో వైద్యులు, ఆసుపత్రుల పై దాడులు జరగ కుండా, 2008 లో అప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖరరెడ్డి తెచ్చిన ఆంధ్ర ప్రదేశ్ వైద్య రక్షణ చట్టం కింద రక్షణ కల్పించాలని, ఈ చట్టం గురించి రాష్ట్రంలోని అన్ని పోలీస్ స్టేషన్ లకు తెలుపుతూ సర్క్యులర్ జారీ చేయాలని చేసిన విజ్ఞప్తికి స్పందిస్తూ ప్రస్తుతం రాష్ట్రంలో అటువంటి సంఘటనలు ఇటీవలి కాలంలో జరగలేదని, అవసరమైనపుడు వైద్యులు, ఆసుపత్రుల పై భౌతిక దాడులు జరగకుండా తక్షణం రక్షణ కల్పిస్తామని, దాడులు జరిగితే చట్ట ప్రకారం తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. వెంటనే ప్రస్తుతం ఉన్న చట్టం వివరాలను అన్ని జిల్లాల పోలీస్ అధికారులకు పంపించి , వైద్యులు , ఆసుపత్రుల పై దాడులు జరిగిన పక్షంలో ఈ చట్టం ప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

అదే విధంగా ఆసుపత్రిలో రోగులు మరణించిన సందర్భాలలో రోగుల బంధువులు ఫిర్యాదు చేసినప్పుడు, వైద్యుల పై కేసులు నమోదు చేసే సమయములో సుప్రీమ్ కోర్ట్ తీర్పులు పరిగణ లోకి తీసుకోవాలని, ముగ్గురు సభ్యుల వైద్య నిపుణుల కమిటీ ప్రాథమిక నివేదిక ఆధారంగా కేసుల నమోదు చేయాలని, వైద్యుల ను అరెస్ట్ చేయకుండా సుప్రీమ్ కోర్ట్ ఆదేశాలను అనుసరించాలని ఐ ఎం ఎ నాయకులు చేసిన విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించి, వైద్యులు ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగులకు తక్షణ వైద్యం అందించి తమ వంతు ప్రయత్న లోపం లేకుండా నిర్భయంగా తమ వైద్యం అందించాలని కోరారు.

# అలా చేయమని తెలంగాణ ప్రజలు కవితను కోరారా.. కిషన్ రెడ్డి విమర్శలు

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా సంచలనంగా మారిన ఢిల్లీ లిక్కర్ స్కాం కేసు నిందితులపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి విమర్శలు గుప్పించారు.ఢిల్లీలో లిక్కర్ వ్యాపారం చేయమని తెలంగాణ ప్రజలు కవిత ను కోరారా అని ఆయన ఢిల్లీలో గురువారం మీడియాతో మాట్లాడుతూ అన్నారు. కవిత తెలంగాణ ప్రజలు సిగ్గుపడే పని చేశారని, దేశంలో తెలంగాణ పరువు తీశారని ధ్వజమెత్తారు. తెలంగాణలో ఇప్పటికే బెల్ట్ షాప్‌లు పెట్టిన ఘనత కేసీఆర్‌ది అని, మద్యంపై వచ్చే ఆదాయాన్ని ప్రధాన వనరుగా మార్చుకున్నారని ఆయన ఎద్దేవా చేశారు.'మహిళల గురించి మాట్లాడే నైతిక



హక్కు కల్వకుంట్ల కుటుంబానికి లేదు. క్యాబినెట్ లో ఒక్క మహిళా లేకుండా మొదటి ప్రభుత్వం నడిపారు. మహిళా రిజర్వేషన్ బిల్లు ను అడ్డుకున్నది ఎస్పీ, ఆర్జేడీ పార్టీలే. వారితో అంటకాగుతున్న కేసీఆర్ ఈ విషయాన్ని ఎందుకు అడగడం లేదు. మద్యం కేసులో ఇరుక్కున్న కవిత సానుభూతి కోసం డ్రామా ఆడుతున్నారు.ఇప్పుడు మహిళా రిజర్వేషన్ బిల్లు యాదికి వచ్చింది. రాజ్యసభకు ఒక్క మహిళను కూడా పంపని చరిత్ర కేసీఆర్‌ది. మహిళా రాష్ట్రపతి, కేంద్రంలో అనేక మంది మహిళా మంత్రులు ఉన్నారు. కేంద్ర ఆర్థిక మంత్రిగా తెలుగు మహిళ ఉన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లుపై ఏకాభిప్రాయం వస్తే మాకు ఎలాంటి అభ్యంతరం లేదు. మహిళల హక్కులను కాపాడతాం. కల్వకుంట్ల కవిత కోరిక మేరకు సీబీఐ ఆమె ఇంటికి వచ్చి దర్యాప్తు చేసింది. ఇప్పుడు కూడా వారికి కావాల్సిన సమయం ఇచ్చాం. దర్యాప్తు సంస్థలను రోజూవారి మానిటర్ చేసే తీరికమాకు లేదు. తెలంగాణ లో దోచుకున్నది సరిపోక ఢిల్లీలో మద్యం దందా చేశారు.మీ అక్రమ మద్యం వ్యాపారానికి , తెలంగాణకు, మహిళలకు ఎందుకు లింక్ పెడుతున్నారు. ఈ వ్యాపారం మహిళల కోసం చేశారా? మీరు అక్రమ వ్యాపారం చేయకపోతే ఎందుకు భుజాలు తడుముకుంటున్నారు.

# ఫేక్ ట్రోలింగ్ కు దిగజారిన జగన్

## వంగలపూడి అనిత

విశాఖపట్నం జగన్ ఫేక్ సీఎం అన్నది అందరికీ తెల్సిందే. మహిళా దినోత్సవం సందర్భంగా నాపై జగన్ ఫేక్ ట్రోలింగ్ కి దిగజారాడని టీడీపీ మహిళా అధ్యక్షురాలు వంగలపూడి అనిత అన్నారు. నేను మాట్లాడిన మాటలను ఎడిట్ చేయడం దారుణం. ఇలా చేసిన వాడిని కన్న తల్లి కూడా సిగ్గుపడుద్దని అన్నారు. చేయించిన వాడు ఇంకా సిగ్గు పడాలి. జగన్ సీఎం అవ్వడని తెలిసి ఇలా ఎడిట్ చేసి సునకానందం పొందుతున్నాడు. ఇది చేసింది ప్రదీప్ అని తెలిసింది. అరేయ్ నీ కన్న తల్లిదండ్రులు ఎవరో చెప్పుకోలేని దౌర్భాగ్య పరిస్థితిలో వున్నావు. సోషల్ మీడియా పనికిమాలిన వాళ్ళ సంగతి సరే. మరి గొప్పగా చెప్పుకునే సాక్షి టీవీకి బుద్ధి ఏమయ్యిందని ఆమె అన్నారు.నారాసుర రక్త చరిత్ర అని రాసిన నా గురించి రాయడం తప్పులేదు.నాపై పనికి మాలిన ట్రోలింగ్ చేసిన ఎదవులు నాకు ఫోన్ చేసి బెదిరిస్తున్నారు. అక్కడితో ఆగకుండా టీడీపీ అధ్యక్షుడు అచ్చెన్నాయుడు పేరుతో ఓ ఫేక్ షోకాజ్ లెటర్ రిలీజ్ చేశారు. జగన్ బ్యాచ్ 5 రూపాయలకు ఆశపడి ఫేక్ బ్రతుకులు బతుకుతున్నారు. బురదలో బ్రతికే బ్రతుకులు వైసీపీ ఫేక్ బ్యాచ్ వి. టీడీపీ తెలుగు మహిళ అధ్యక్షురాలు, పొలిట్ బ్యూరో సభ్యురాలిగా ఓ దళిత మహిళకు టీడీపీ ఇచ్చిన గౌరవం ఇదని అన్నారు.సాక్షి పైనా, ఫేక్ బ్యాచ్ పైనా పోలీసులకు ఫిర్యాదు చేస్తా. అట్రాసిటీ కేసు పెడతా. మిగతా వారి మాదిరిగా వదలను. మీ నాయకుడు నత్తి పకోడీ గాడిపై మీ టేలెంట్ చూపించండి. మీ ఇళ్ళకొచ్చి చీపురుతో చితకబాదుతానని హెచ్చరించారు.

# సంపాదకీయం

శుక్రవారం 10-03-2023

## రాహుల్... నీకిది తగునా

కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ బ్రిటన్ పర్యటన వివాదాస్పదంగా మారింది. విదేశీ గడ్డపై నుంచి రాహుల్ గాంధీ దేశ అంతర్గత రాజకీయ విభేదాలను ప్రస్తావించడం, దేశ అంతర్గత విషయాల్లో విదేశాల జోక్యం చేసుకోవాలని కోరడం ఏమిటని బీజేపీ ప్రశ్నిస్తోంది. లండన్‌లో ఇండియన్ జర్నలిస్ట్స్ అసోసియేషన్ నిర్వహించిన కార్యక్రమంలో రాహుల్ గాంధీ.. భారత్ జోడో యాత్ర, రష్యా, చైనాల విషయంలో భారత విదేశాంగ విధానం, బీబీసీ డాక్యుమెంటరీపై నిషేధం, ఆశ్రిత పక్షపాతం వంటి అంశాల మీద మాట్లాడారు.'పాలిటిక్స్ అండ్ ద పీపుల్: ఫ్రం పర్సెప్షన్ టు పర్ఫార్మెన్స్' పేరిట నిర్వహించిన కార్యక్రమంలో రాహుల్ గాంధీ మీడియాతో మాట్లాడారు. ఇండియన్ జర్నలిస్ట్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ డానిష్ ఖాన్ ఈ కార్యక్రమానికి మోడరేటర్‌గా వ్యవహరించారు. భారత్, బ్రిటన్‌లకు చెందిన పాత్రికేయులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.ఇంతకుముందు మార్చ్ 3న కూడా రాహుల్ గాంధీ బ్రిటన్‌లోని కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయంలో మాట్లాడుతూ భారత్‌లో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని అన్నారు. భారత్‌లో ప్రజాస్వామ్యానికి ముప్పు ఏర్పడడానికి ప్రధాని మోదీ, భారతీయ జనతా పార్టీలే కారణమని ఆయన ఆరోపించారు.అయితే, బీజేపీ నాయకులు రాహుల్ గాంధీ విమర్శలకు సమాధానం చెప్పారు. ఆ పార్టీ అధికార ప్రతినిధి షాజాద్ పూనావాలా మాట్లాడుతూ రాహుల్ గాంధీ నాన్నమ్మ ఇందిరాగాంధీ ఈ దేశానికి ప్రధానిగా ఉన్నప్పుడు దేశంలో అత్యయిక పరిస్థితి విధించారని.. అలాంటి వారసత్వం నుంచి వచ్చిన రాహుల్ ఇప్పుడు ప్రజాస్వామ్యం గురించి పాఠాలు చెప్తున్నారని విమర్శించారు.కాంగ్రెస్ ఎంపీ, రాహుల్ గాంధీ భారత దేశాన్ని అవమానిస్తున్నారని బీజేపీ సీనియర్ నేత రవిశంకర్ ప్రసాద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బ్రిటన్‌కు వెళ్ళి భారత దేశ ప్రజాస్వామ్యం, రాజనీతి, పార్లమెంటు, న్యాయ వ్యవస్థ, భద్రతలను అవమానిస్తున్నారని మండిపడ్డారు. మన దేశంలో విదేశీ జోక్యాన్ని కోరుతున్నారన్నారు. ఈ వ్యాఖ్యలను సమర్థిస్తారా? అని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను, ఆ పార్టీ మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీని ప్రశ్నించారు. ఒకవేళ ఈ వ్యాఖ్యలను సమర్థించకపోతే, వాటితో తమకు సంబంధం లేదని స్పష్టం చేయాలని కోరారు. నిజానికి, బీజేపీ నాయకులు మాత్రమే కాదు, కాంగ్రెస్ నాయకులు కూడా రాహుల్ గాంధీ వ్యాఖ్యలను సంర్థించేందుకు వెనకా ముందు అవుతున్నారు. రాహుల్ గాంధీ బ్రిటన్‌లో ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ, యూరోప్, అమెరికా దేశాలు భారత దేశం నుంచి వ్యాపార, వాణిజ్యాలను, ఆదాయాన్ని పొందుతున్నాయని, భారత దేశంలో ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించేందుకు ఆ దేశాలు చేయవలసినంత చేయడం లేదని వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలపై పెద్ద ఎత్తున విమర్శలు వస్తున్న సంగతి తెలిసిందే.ఈనేపథ్యంలో రవిశంకర్ ప్రసాద్ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, రాహుల్ గాంధీ బ్రిటన్ ప్రసంగాల్లో భారత దేశాన్ని అవమానించే ప్రయత్నం చేశారని ఆరోపించారు. భారత దేశ ప్రజాస్వామ్యం, రాజనీతి, పార్లమెంటు, న్యాయ వ్యవస్థ, భద్రతలను అవమానిస్తున్నారని మండిపడ్డారు. మన దేశంలో విదేశీ జోక్యాన్ని కోరుతున్నారన్నారు. భారత దేశంలో ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించేందుకు అమెరికా, యూరోపియన్ యూనియన్ జోక్యం చేసుకోవాలని రాహుల్ గాంధీ కోరడం అత్యంత బాధ్యతారహితమని, దీనిపై ఖర్గే, సోనియా గాంధీ తమ వైఖరిని వెల్లడించాలని డిమాండ్ చేశారు. రక్షణ మంత్రిగా పని చేసిన దివంగత ఏకే ఆంటోనీ అధికారికంగా చైనాపై తెలిపిన వైఖరిని రవిశంకర్ ప్రసాద్ ఈ సందర్భంగా ప్రస్తావించారు. సరిహద్దుల్లో మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడం ద్వారా చైనాను ఇబ్బంది పెట్టాలని మేం అనుకోవడం లేదు అని ఆంటోనీ గతంలో అన్నారని ప్రసాద్ గుర్తు చేశారు. రాహుల్ గాంధీ ఇటీవల బ్రిటన్‌లో మాట్లాడుతూ, చైనా ముప్పును విదేశాంగ మంత్రి సుబ్రహ్మణ్యం జైశంకర్ అర్థం చేసుకోవడం లేదని ఆరోపించిన నేపథ్యంలో ప్రసాద్ ఈ ప్రస్తావన చేశారు.ప్రస్తుతం బ్రిటన్ పర్యటనలో ఉన్న రాహుల్.. బీజేపీ టార్గెట్‌గా తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు. పార్లమెంట్‌లో ప్రతిపక్షాల గొంతు నొక్కేస్తున్నారని.. మైకులు ఆఫ్ చేస్తున్నారని రాహుల్ చేసిన వ్యాఖ్యలు అగ్గి రాజేశాయి.. ఇతర దేశాల్లో రాహుల్ ఈ విధంగా మాట్లాడడం సరికాదని బీజేపీ నేతలు ఎదురుదాడికి దిగారు. ఇదే సమయంలో రాహుల్ గాంధీ పార్లమెంట్ అటెండెన్స్‌పై ఆసక్తికర గణాంకాలు బయటకువచ్చాయి. రాహుల్ గాంధీ చేసిన కామెంట్స్‌పై కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ సీనియర్ సలహాదారు కంచన్ గుప్తా తీవ్రంగా స్పందించారు. ట్వీట్టర్‌లో రాహుల్ అటెండెన్స్‌ను పోస్ట్ చేస్తూ విమర్శలు గుప్పించారు.భారత్ పార్లమెంట్‌లో ప్రతిపక్షాలు మౌనంగా ఉన్నాయన్న రాహుల్ గాంధీ వ్యాఖ్యలు నిరాధారమైనవిగా కంచన్ గుప్తా కొట్టిపారేశారు. పార్లమెంట్‌లో తమ మైక్‌లు పని చేస్తాయి.. కానీ వాటిని ఆన్ చేయలేమని.. తాను మాట్లాడుతున్నప్పుడు ఇది చాలాసార్లు జరిగిందంటూ రాహుల్ చేసిన వ్యాఖ్యలను తిప్పికొట్టారు. వయనాడ్ ఎంపీగా ఉన్న రాహుల్ గాంధీ జీరో అటెండెన్స్ ఉన్నప్పుడు సైతం భారత్ పార్లమెంట్ సమావేశాలు మొత్తం జరిగాయని కంచన్ గుప్తా గుర్తు చేశారు. రాహుల్ గాంధీ తమ పేలవమైన పని తీరును కప్పిపుచ్చుకునేదుకు నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారని రాహుల్ గాంధీ పార్లమెంట్ అటెండెన్స్ డేటాను ట్వీట్ చేశారు.రాహుల్ గాంధీ పార్లమెంట్ హాజరు కేరళ సగటు కంటే చాలా తక్కువగా ఉందని కంచన్ గుప్తా వరుస ట్వీట్లలో ఆరోపించారు. జాతీయ సగటు కంటే కూడా ఆయన హాజరు శాతం చాలా తక్కువ అని విమర్శించారు. 2020లో పార్లమెంట్ వర్షకాల సమావేశాలలో రాహుల్ గాంధీ హాజరు శాతం జీరోగా ఉందన్నారు. ఓవరాల్‌గా రాహుల్ పార్లమెంట్ అటెండెన్స్ 52శాతమేనని.. అదే సమయంలో మొత్తం ఎంపీల హాజరు శాతం 79గా ఉందన్నారు. భారత పార్లమెంటులో 2019 నుంచి 2023 మధ్య రాహుల్ గాంధీ 92 ప్రశ్నలు అడిగారని.. ఇందుకు సంబంధించి కేరళ ఎంపీల సగటు 216గా, జాతీయ సగటు 163గా ఉందని విమర్శించారు. సగటున భారత్ ఎంపీలు 68 చర్చల్లో పాల్గొంటే.. రాహుల్ గాంధీ స్కోర్ దారుణంగా 6 మాత్రమే ఉందని వరుస ట్వీట్లలో ఫైర్ అయ్యారు. దీంతో ట్విట్టర్‌లో బీజేపీ మద్దతుదారులు సైతం కంచన్ గుప్తా ట్వీట్లను రీట్వీట్ చేస్తూ రాహుల్‌పై విమర్శలు గుప్పిస్తున్నారు.

# తగ్గేది లేదంటున్న ఉద్యోగులు...

విజయవాడ, మార్చి 9,ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉద్యోగుల విషయంలో వ్యవహరిస్తున్న తీరు ఉద్యోగ సంఘాల నేతలను తీవ్రంగా నిరాశపరుస్తోంది. మొదట్లో అనుకున్నది ఒకటి ఇప్పుడు జరుగుతోంది ఒకటని మధనపడుతున్నారు. సమయాజనికి జీతాలే రావడం లేదు. డీఏలు అసలు ఇవ్వడం లేదు. ఫిట్ మెంట్ తగ్గించిన పీఆర్‌ఎస్ ఇచ్చారు. తాను దాచుకున్న జీపీఎఫ్‌ను ప్రభుత్వం వాడేసుకుంది. కొన్నాళ్లుగా సీపీఎస్ కు సంబంధించిన మొత్తమూ చెల్లించడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. రిటైర్మెంట్ వయసు పెంచారు కాబట్టి రిటైర్మెంట్లు లేవు కానీ వీఆర్‌ఎస్ తీసుకున్న వారికి చుక్కలు కనిపిస్తున్నాయి. ఇవి కాకుండా పని పరమైన అనేక సమస్యలను వారు ప్రభుత్వం ముందు పెడుతున్నారు. కానీ ప్రభుత్వానికి ఉన్న సమస్యే నిధులు. మరి ఇప్పుడు ఉద్యోగుల్ని ఎలా కూల్ చేస్తారు? ఉద్యోగ సంఘాల డిమాండ్లు నిజానికి కొత్తవి కాదు. పాత సౌకర్యాలు కల్పించమని.. తాము దాచుకున్న డబ్బులు తమకు ఇవ్వాలని.. సమయానికి జీతాలివ్వాలని కోరుతున్నారు. అలాగే ప్రధానంగా పదేళ్ల సర్వీసు పూర్తయిన కాంట్రాక్ట్ ఉద్యోగుల రెగ్యులర్ అంశం సహా అనేక డిమాండ్లను ప్రభుత్వం ముందు పెడుతున్నారు.13 వేల మందిని రెగ్యులర్ చేస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరుతున్నారు. అలాగే పెండింగ్ డీఏల చెల్లింపు, సీపీఎస్‌పై ప్రభుత్వ నిర్ణయం, గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల బదిలీలు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు సంక్షేమ పథకాలు తదితర అంశాలున్నాయి. ఇవికాకుండా పెండింగ్‌లో ఉన్న రెండు డీఏల అంశానికి సంబంధించి ఎన్నికల కోడ్ ముగిశాక ఒక డీఏ ఇస్తామని ఇప్పటికే ప్రభుత్వం నియమించిన కమిటీ హామీ ఇచ్చింది. సీపీఎస్‌పై కూడా త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని చెబుతోంది. సీపీఎస్ ఉద్యోగులపై నమోదు చేసిన 1,600 కేసులను కూడా మాఫీ చేసేందుకు కమిటీ- అంగీకారం తెలిపింది. గ్రామ వార్డు సచివాలయం ఉద్యోగుల బదిలీలపైనా అంగీకారం తెలియజేసింది. వారికి సర్వీస్ రూల్స్, జాబ్ ఛార్ట్ సిద్ధం చేస్తామని హామీఇచ్చింది. ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు సంక్షేమ పథకాలు అమలు, ఉద్యోగులకు ఇళ్ల స్థలాలు, రిజిస్ట్రేషన్ విలువ ప్రకారం భూ కేటా తున్న క్రమంలోనే ప్రభుత్వం సీఎస్ నేతృత్వంలో ఉద్యోగ సంఘాలతో మంగళవారం భేటీ ఏర్పాటుచేసే అవకాశాలు కనిపిస్తున్నాయి.మంత్రి బొత్స సత్య నారాయణ, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణా రెడ్డితో ఉద్యోగ సంఘాలతో చర్చలు ప్రారంభించారు. ఉద్యోగ సంఘాల నేతలతో చర్చలు జరిపి వారి సమస్యలపట్ల సానుకూలంగా ప్రభుత్వం ఎలా వ్యవహరించ బోతోం దన్న అంశంపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. ప్రస్తుతం జరుగుతున్న ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలపై పార్టీ నేతలు, ప్రభుత్వ పెద్దలు పూర్తి స్థాయిలో దృష్టి సారించి వాటిని గెలిచితీరాలన్న ధ్యేయంతో ఉన్నారు. ఈ పరిస్థితుల్లోనే ఉద్యోగ సంఘాలు ఉద్యమ కార్యాచరణకు దిగడం పట్ల ప్రభుత్వ పెద్దలు కూడా వారిపై కొంత అసంతృప్తితోనే ఉన్నట్లు కనిపిస్తోంది. ఉద్యోగ సంఘాలు గతంలో ఏవైతే డిమాండ్లతో ఉద్యమానికి దిగుతామని ప్రభు త్వానికి చెప్పాయో ఇప్పుడు కూడా అవే డిమాండ్లతో ఉద్యమ కార్యాచరణ ప్రకటించడం జరిగిందని అంటున్నారు. వాటిని అమలు చేస్తామని గతంలోనేచెప్పామంటున్నారు. ఉద్యోగులు ప్రభుత్వంలో భాగమని, వారి సమస్యల పట్ల తాము సానుకూలంగానే ఉంటామని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. సీఎం గా జగన్ వస్తే సీపీఎస్ రద్దు అవుతుందని.. ఊహించనంత ఫిట్ మెంట్‌తో పీఆర్సీ ఇస్తారని డీఏలు ఆపరని.. ఇలా రకరకాలుగా ఉద్యోగులు ఊహించుకున్నారు. కానీ వాస్తవంగా జరుగుతోంది వేరు. జీతాలే సరిగ్గా రావడం లేదు. ఐఆర్ కంటే ఫిట్ మెంట్ తగ్గించారు.డీఎలు ఆపి ఒక్కసారి ఇచ్చి ఆ లోటును భర్తీ చేశారు. మొత్తంగా తాము మోసపోయామనుకుంటున్నారు. అదే సమయంలో జీపీఎఫ్ లు సహా అనేక ఆర్థిక పరమైన అంశాల్లో ఉద్యోగులు రగిలిపోతున్నారు. అందుకే ఉద్యమ కార్యచరణను ప్రకటించారు. వీరిని చల్లబర్చాలంటే.. ఆర్థిక ప్రయోజనాలు కల్పించాలి. అంత ప్రయోజనాలు కల్పించాడనికి ప్రభుత్వం వద్ద వెసులుబాటు లేదు. ఈ సమస్యను ప్రభుత్వం ఎలా అధిగమిస్తుందనేది కీలకం.

## నల్లమల్లలో మదర్ టైగర్ ఆపరేషన్

కర్నూలు, మార్చి 9,నల్లమల అటవీ ప్రాంతం అయిన ఆత్మకూరు డివిజన్, గుమ్మాడాపురం అటవీ ప్రాంతంలో మదర్ టైగర్ టీ 108 ఆపరేషన్ ముమ్మరంగా సాగుతుంది. కనిపించకుండా పోయిన తల్లి పులి కోసం అటవీ శాఖ ఆధ్వర్యంలో గుమ్మడ పురం నల్లమల్ల అటవీ ప్రాంతంలో సుమారు 70 ట్రాప్ కెమెరాలతో అన్వేషణ కొనసాగుతుంది. ఇప్పటి వరకూ తల్లిపులి ఆచూకీ కనిపించలేదు. చివరి ప్రయత్నంగా ప్రత్యేక డ్రోన్ కెమెరా బృందాలను అటవి శాఖ అధికారులు రంగంలో దించారు. డ్రోన్ కెమెరాలతో గుమ్మడా పురం అడవి శాఖ పరిధిలో ప్రత్యేకంగా ఏరియల్ సర్వే నిర్వహిస్తున్నారు. ఏరియల్ సర్వేలో తల్లిపులిని గుర్తిస్తే పిల్ల పులులను దాని వద్దకు చేర్చే అవకాశం ఉంది. అయితే తల్లి పులి కదలికను అంచనావేసి ఆ తర్వాతనే నిర్ణయం తీసుకోనున్నారు. ఒకవేళ తల్లి పులి జాడ తెలియకపోతే తిరుపతి జూ కు ఆడ పసి పులి పిల్లలను తరలించే అవకాశం ఉంది. తల్లి పులి మనుగడపై రోజు రోజుకు అనుమానాలు పెరుగుతున్నాయని అటవీ అధికారులు చెబుతున్నారు. చివరి సారిగా డిసెంబర్ లో ట్రాప్ కెమెరా లో ట్రేసౌట్ చేశారు. ఆ తర్వాత దాని ఆచూకీ నేటి వరకు అటు విశాఖ అధికారులు గుర్తించింది లేదు. ప్రస్తుతం కూడా పులి పిల్లలు లభ్యమైన అటవీ పరిసరాల్లో ఎక్కడా కూడా తల్లి పులి పాద ముద్రలు లభించలేదు. తలిపులి ఉందా లేదా అన్నది సస్పెన్స్‌గా మారింది. అటవీశాఖ ఆధ్వర్యంలో పట్టువదలని విక్రమార్కుల్లా డబ్ల్యూ డబ్ల్యూ ఎఫ్ వైల్డ్ కంజర్వేషన్ దృష్టికి తీసుకెళ్లి మదర్ టైగర్‌ఆపరేషన్ ఇందులో భాగంగా ఇప్పటికే ఎన్ టి సి ఏ కూడా రంగంలో దిగింది. ఈ బృందం ఆత్మకూరులోనే ఉండి.. పర్యవేక్షిస్తున్నట్లు ఎన్ ఎస్ టి ఆర్ అధికారులు చెబుతున్నారు. అధికారుల అన్వేషణ ఎలా ఉన్నప్పటికీ ప్రస్తుతం బిక్కు బిక్కుమంటూ ఆత్మకూరు అటవీ అధికారుల చెంతే నాలుగు ఆడ పసి పులి కూనలు మగ్గుతున్నాయి. అధికారులు వీటి సంరక్షణకు పడుతున్న పాట్లు పడుతున్నారు. తల్లి పులి వయస్సు 8 సంవత్సరాలు ఉండొచ్చని, టైగర్ నంబర్ 108 గా గుర్తించామని అధికారులు చెబుతున్నారు. పులి పిల్లలు లభ్యమైన ప్రాంతంలో తల్లి పులి అరుపులు విన్నామని సిబ్బంది వెల్లడించారు. తల్లి కోసం గాలిస్తున్నామని.. పిల్లలకు దూరమైన తల్లి పులి ప్రవర్తనను అంచనా వేయలేమన్నారు. చాలా ఉద్రేకంగా ఉంటుందని కాబట్టి అత్యంత జాగ్రత్తగా అంచనా వేస్తున్నామన్నారుఒకేసారి నాలుగు పిల్లలకు పులి జన్మనివ్వడం అరుదని.. పైగా అడ పులులు కావడం దేశ చరిత్రలోనే అత్యంత అరుదని అటవీ శాఖ అధికారులు చెబుతున్నారు. తల్లి పులి జాడ లేకపోతే రెండేళ్లు సంరక్షించి అటవీ ప్రాంతం లో వదిలేస్తామని అటవీ అధికారులు చెబుతున్నారు.

# ఈజీ మనీ కోసం గంజాయి సాగు



కాకినాడ, మార్చి 9, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో గంజాయి గుప్పుమంటుంది. చెడు వ్యసనాలకు బానిసై మత్తులో జోగుతూ గంజాయి సేవించడమే కాకుండా ఎదుటివారికి విక్రయించి డబ్బులు సంపాదించి మరింత జల్సాలు చేసేందుకు ఉత్సాహం చూపిస్తున్న యువత ఇటీవల కాలంలో పోలీసులు దాడుల్లో అరెస్టైన పరిస్థితి కనిపిస్తుంది. గంజాయి జోరుగా చేతులు మారుతుండడంతో నిఘా పెట్టిన జిల్లా ఎస్పీ సుధీర్ కుమార్ రెడ్డి అటు తూర్పుగోదావరి జిల్లా, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలోను ప్రత్యేక బృందాలను రంగంలోకి దించారు. అదే విధంగా కాకినాడ జిల్లా పరిధిలో కూడా ఎస్పీ రవీంద్రనాథ్ బాబు నిఘా పెంచడంతో గంజాయి కేసులు ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్నాయి. ఈ కేసుల్లో దొరుకుతున్న వారందరూ ఎక్కువగా 25 ఏళ్ల లోపు యువకులే కావడం ఆందోళన కలిగించే అంశంగా కనిపిస్తోంది. గంజాయ విక్రయాల జరుపుతున్న ముగ్గురు వెస్ట్ బెంగాల్ యువకులు పోలీసులకు చిక్కారు. అంబేద్కర్ జిల్లా కోనసీమ జిల్లా ఆలమూరు పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం జొన్నాడ వద్ద గంజాయి అమ్మకాలు జరుగుతున్నాయని సమాచారం రావడంతో రావులపాలెం సీఐ ఎన్. రజని కుమార్, ఆలమూరు ఎస్సై శివ ప్రసాద్ లు సిబ్బందితో కలసి దాడులు చేశారు. ఆ గ్రామ శివారులో అక్రమంగా గంజాయి కలిగి ఉన్న ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి సుమారు 21 కేజీల గంజాయిని ఆలమూరు తహశీల్దార్ శెట్టి, జొన్నాడ వీఆర్వో వెంకటేశ్వరరావు సమక్షంలో స్వాధీనం చేసుకున్నారు. ఈ ముగ్గురు వెస్ట్ బెంగాల్ రాష్ట్రం నుంచి ఆలమూరు మండలంలో వివిధ బట్టీలలో పనులు చేసుకోవడానికి వచ్చారు. అయితే ఎక్కువ డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో గంజాయిని ఈ ప్రాంతానికి తీసుకువచ్చి అమ్ముతున్నట్లు పోలీసులు వివరించారు. చెడు వ్యసనాలకు బానిసై, గంజాయి తాగుతూ, చుట్టు పక్కల గ్రామాల్లో అమ్ముతున్న ఏడుగురు యువకులను అమలాపురం పోలీసులు అరెస్టు చేశారు. వాళ్లంతా 24 ఏళ్ల లోపు యువకులే కావడం గమనార్హం. ఏజెన్సీ ప్రాంతమైన చింతపల్లిలో గంజాయిని కొనుగోలు చేసుకుని, అమలాపురం పట్టణంలోని సావరం బైపాస్ దగ్గర మారుమూల ప్రదేశంలో గంజాయిని పంచుకుంటుండగా పోలీసులు రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. త్రిపురారి సాయి సూర్య జగదీష్, దూలం వీరేంద్ర కుమార్, గోకరకొండ కొండబాబు, జుత్తిక పవన్, వాసంశెట్టి ప్రసాద్, బెహర కళ్యాణ్, కముజు నరసింహ ఏడుగురిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి సుమారు 21 కేజీల గంజాయిని, 6 సెల్ ఫోన్లను స్వాధీనపరుచుకున్నట్లు వెల్లడించారు. నిందితులను కోర్టు ఆదేశాలతో రిమాండ్ కు తరలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. చెడు వ్యసనాలకు బానిసై గంజాయి రవాణా చేస్తున్న ఆరుగురు యువకులను ముమ్మిడివరం పోలీసులు అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 70 వేల విలువ చేసే 23 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఏజెన్సీ ప్రాంతమైన నర్సీపట్నం చుట్టుపక్కల నుంచి గంజాయి రవాణా అవుతున్నట్లు సమాచారం రావడంతో పోలీసులు తనిఖీలు ముమ్మరం చేశారు. ఈ నేపథ్యంలో ముమ్మిడివరం మండలం అన్నంపల్లి అక్విడెట్ వద్ద గంజాయి రవాణా జరుగుతున్నట్లు సమాచారం రావడంతో ఎస్సై సురేష్ బాబు ఆధ్వర్యంలో పోలీసులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. అక్కడ గంజాయి ప్యాకెట్లు పంచుకుంటున్న నక్కా మధు, మాకే అబ్బులు, కొండేపూడి సిద్ధార్థ కుమార్, మోకా చంటి, మోకా శ్రీనివాసరావు, పెనుమాల విజయ్ కుమార్ అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 23 కేజీల గంజాయి ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు. ముమ్మిడివరం తహసీల్దార్ ఎడ్ల రాంబాబు, వీఆర్వోలు వీఎస్ కిరణ్, వై రాధాకృష్ణ సమక్షంలో గంజాయి స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. నిందితుల నుంచి నాలుగు మోటర్ సైకిల్స్, నాలుగు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్ట్ చేసి కోర్టుకు తరలించగా మెజిస్ట్రేట్ రిమాండ్ విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

## డేట్స్...అప్ డేట్....

గుంటూరు, మార్చి 9,మార్చి, ఏప్రిల్ నెలల్లో ప్రభుత్వ కార్యక్రమాలు, పథకాల అమలు తేదీలను ఏపీ ప్రభుత్వం ఖరారు చేసింది. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ కారణంగా పలు కార్యక్రమాల అమలు నిలిచిపోయిన విషయం తెలిసిందే. త్వరలో ఎన్నికల కోడ్ ముగియనుండటంతో కార్యక్రమాలు, పథకాల అమలుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ఈ మేరకు అధికారులతో సమావేశమైన ముఖ్యమంత్రి జగన్.. పలు పథకాలు ప్రారంభించే తేదీలను ఖరారు చేశారు. మార్చి 14 నుంచి అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించిన ప్రభుత్వం.. బీఏసీ సమావేశంలో షెడ్యూల్ ఖరారు చేయనుంది.ఎన్నికల కోడ్‌తో సంబంధం లేని కారణంగా మార్చి 10 నుంచి మధ్యాహ్న భోజనంతో పాటుగా రాగిజావ కార్యక్రమాన్ని ప్రారంభించాలని సీఎం జగన్ నిర్ణయించారు. ఈ స్కీమ్ కింద విద్యార్థులకు పోషకాహారం అందించనున్నారు. మార్చి 18న సంపూర్ణ ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని అమలు చేయాలని నిర్ణయించిన ప్రభుత్వం... జగనన్న విద్యాదీవెన లబ్ధిదారుల ఖాతాల్లోకి డీబీటి పద్ధతిలో నగదు జమ చేయనుంది. మార్చి 22న ఉగాది రోజున ఉత్తమ సేవలందించిన వాలంటీర్ల పేర్లను ప్రకటించనుంది. వీరికి ఏప్రిల్ 10న అవార్డులు, రివార్డులు అందజేయనుంది. మార్చి 23న జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని ప్రారంభించనుంది.మార్చి 25 నుంచి వైయస్సార్ ఆసరా పథకాన్ని ప్రారంభించి ఏప్రిల్ 5 వరకూ కొనసాగించనుంది ప్రభుత్వం. మార్చి 31న జగనన్న వసతి దీవెన అమలు చేయనుంది. ఏప్రిల్ 6 నుంచి ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ ని అమలు చేయనుంది. ఏప్రిల్ 10న ఎంపిక చేసిన ఉత్తమ వలంటీర్లకు పురస్కారాలు, బహుమతులు అందజేయనుంది. ఏప్రిల్ 18న ఈబీసీ నేస్తం పథకాన్ని సీఎం జగన్ సర్కార్ అమలు చేయనుంది.ఇక కీలకమైన బడ్జెట్ ను మార్చి 17వ తేదీన ప్రవేశపెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైనట్లు తెలుస్తోంది. మార్చి 15వ తేదీన గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై చర్చించడంతో పాటు సీఎం కూడా మాట్లాడే అకాశం ఉంది. ఈ తేదీలపై క్లారిటీ రావాల్సి ఉంది.

# ఏపీలో 18 లక్షల వ్యవసాయ మోటార్లు

విజయవాడ, మార్చి 9, వ్యవసాయం మోటర్లకు స్మార్ట్ మీటర్లపై ఎలాంటి అపోహలు నమ్మవద్దన్నారు రాష్ట్ర ఇంధన శాఖ ప్రత్యేత ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్. వాస్తవిక దృక్పథంతో, సాధ్యాసాధ్యాలను పరిశీలించిన తర్వాతే డిస్కంలు, ప్రభుత్వం వ్యవసాయ పంపుసెట్లకు స్మార్ట్ మీటర్లు పెట్టాలని నిర్ణయించాయని స్పష్టం చేశారు. మంగళవారం విజయవాడ విద్యుత్ సౌథలో నిర్వహించిన మీడియా సమావేశంలో విజయానంద్ మాట్లాడుతూ రైతు ఎంత విద్యుత్ ను వినియోగిస్తున్నారు, దానికి ప్రభుత్వం నెలవారీగా ఎంత సబ్సిడీ ఇస్తోంది అనే అంశాలను పూర్తిస్థాయిలో రైతుకు తెలియజేసేందుకే ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేసుకున్న రైతులు నాణ్యమైన విద్యుత్ విషయంలో డిస్కంలను, అధికారులను ప్రశ్నించవచ్చన్నారు. ప్రభుత్వం ద్వారా పొందుతున్న రాయితీలను రైతులు తెలుసుకోవాలన్నదే స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ముఖ్య ఉద్దేశమన్నారు. ఈ క్రమంలోనే స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారన్నారు.రాష్ట్రంలో వ్యవసాయ కనెక్షన్లకు స్మార్ట్ మీటర్ల ఏర్పాటు చేయడంపై దుష్ప్రచారం చేయడం తగదన్నారు. రైతులను అనవసర ఆందోళనలకు, అయోమయానికి గురిచేయవద్దని కోరారు. రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం రకరకాల కార్యక్రమాలు చేపట్టిందని..అందులో భాగంగానే వ్యవసాయ మోటార్లకు మీటర్లు ఏర్పాటు చేయడం జరుగుతోందన్నారు. స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయడం వల్ల కలిగే ప్రయోజనాలను ఇప్పటికే పలుమార్లు వివరించామన్నారు. స్మార్ట్ మీటర్ల స్థానంలో ఐఆర్ మీటర్లు, డీటీ మీటర్లు, ఫీడర్ మీటర్లు ఎందుకు పెట్టకూడదనే ప్రశ్నలకు గతంలోనే సమాధానం చెప్పడం జరిగిందన్నారు. ఒక మోటార్ కు మీటర్ బిగించడం ద్వారా రైతు ఎంత విద్యుత్ వినియోగిస్తున్నాడనేది కచ్చితంగా తెలుస్తుందన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు టెండర్ డాక్యుమెంట్ ను న్యాయసమీక్షకు పంపించి అక్కడ నుంచి అనుమతి వచ్చాక మాత్రమే టెండర్లను ఖరారు చేయడం జరిగిందన్నారు. స్మార్ట్ మీటర్లు, అలైడ్ మెటీరియల్స్ కు సంబంధించి కేంద్ర ప్రభుత్వం నుంచి దాదాపు రూ.1,600 కోట్లకు పైగా గ్రాంటు కూడా వస్తుందన్నారు. రైతుల ప్రాణరక్షణ బాధ్యతను కూడా ప్రభుత్వమే తీసుకుని మీటర్ల ఏర్పాటులో అవసరమైన అలైడ్ మెటీరియల్ ఉపయోగించడం జరుగుతుందన్నారు.ఇప్పటికే శ్రీకాకుళం జిల్లాలో చేపట్టిన పైలట్ ప్రాజెక్టు విజయవంతం అయిన విషయాన్ని విజయానంద్ గుర్తుచేశారు. ప్రయాస్ ఎనర్జీ గ్రూప్ రిపోర్టు లెక్కలు ఏడాదిన్నర క్రిందటివని అయితే తాము చెబుతున్న లెక్కలు తాజా అధికారిక లెక్కలన్నారు. 2023 ఫిబ్రవరి నాటికి శ్రీకాకుళం జిల్లాలో పెట్టిన ఐఆర్ మీటర్లలో 83.16 శాతం పని చేస్తున్నాయని, వీటి ద్వారా మాత్రమే లైవ్ రీడింగ్ తీసుకుంటున్నామన్నారు. ఈ ఏడాదిన్నరలో ఉన్న సమస్యలను పరిష్కరించడం జరిగిందన్నారు. పైలట్ ప్రాజెక్టు క్రింద శ్రీకాకుళం జిల్లాలో పెట్టిన మొత్తం 29 వేల కనెక్షన్లలో కేవలం 6.6 శాతం మాత్రమే ఆగిపోయిన, కాలిపోయిన మీటర్లు ఉన్నాయని చెప్పారు. పీఈజీ డేటా సరిగా లేదని ప్రభుత్వ అఫీషియల్ డేటాతో లెక్కించి చూస్తే రెండున్నర సంవత్సరాలలో పేబ్యాక్ పీరియడ్ వస్తుందన్నారు. సగటు విద్యుత్ కొనుగోలు ధరను ప్రయాస్ ఎనర్జీ గ్రూప్ ఒక యూనిట్‌కి రూ.4.20 పైసలుగా తీసుకుని లెక్కించడం వల్లే గణాంకాలు సరిగా లేవన్నారు. వాస్తవానికి సగటు సరఫరా ఖర్చు ఒక యూనిట్‌కి రూ.6.98 పైసలు పేర్కొన్నారు. ఈ రూ.6.98 పైసలను రెగ్యులేటరీనే నిర్ణయించింది తప్ప తాము కాదని స్పష్టం చేశారు. ప్రభుత్వం కూడా సగటు సరఫరా ఖర్చును ఆధారంగా చేసుకునే డిస్కంలకు సబ్సిడీ ఇస్తుందన్నారు. డీటీఆర్‌కు మీటర్ పెట్టడం వల్ల అన్నింటికి సంబంధించి విద్యుత్ ఖర్చు తెలుస్తుంది.. తప్ప రైతు ఎంత విద్యుత్ ఖర్చు చేశాడు అనేది తెలియదన్నారు. ఫీడర్‌కు లింకుగా 120 నుంచి 200 విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్లు ఉంటాయని వీటికి రెండేసి కనెక్షన్లు ఉంటాయన్నారుడీటీఆర్, ఫీడర్, డివిజన్, డిస్కం స్థాయిల్లో ఏ మీటర్ ద్వారా ఎంత విద్యుత్ వినియోగం అవుతుందో తెలుసుకోవచ్చన్నారు. రైతుకు తను ఎంత మేర విద్యుత్ వినియోగం చేశారనేది తెలుసుకోవచ్చని తెలిపారు. ప్రభుత్వం నుంచి ఎంత సబ్సిడీ అందుతుందో తెలుసుకోవచ్చన్నారు. ఏ మీటర్ ఎందుకు పనిచేయడం లేదో తక్షణమే తెలుసుకొని వెంటనే చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని వివరించారు. దీన్ని ఏ విధంగా నియంత్రించాలనేది ట్రాన్స్ కో స్థాయిలో, స్టేట్ లో డిస్పాచ్ సెంటర్ స్థాయిలో ఎప్పటికప్పుడు విద్యుత్ పరిస్థితిని అంచనా వేసుకోవచ్చునని, వీటన్నింటిని దృష్టిలో ఉంచుకొని స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేశామన్నారు. స్మార్ట్ మీటర్ల వినియోగం వల్ల అందుబాటులో ఉన్న విద్యుత్ ఎంతుందో తెలుస్తుందని చెప్పుకొచ్చారు. ఫలితంగా మార్కెట్ లో మనం విద్యుత్ ను అమ్మాలన్నా, కొనాలన్నా మార్గం సులువవుతుందన్నారు. అదే విధంగా స్మార్ట్ మీటర్ల ద్వారా ప్రతి 15 నిమిషాలకోసారి డేటా వస్తుందని, మనం ఎక్కడి నుండైనా మీటర్ ను ఆఫ్, ఆన్ చేసే అవకాశం ఉంటుందన్నారు. మీటర్లు ఎంత విద్యుత్ ను వినియోగిస్తున్నాయి? ఏ రకమైన లోడ్ తీసుకుంటున్నాయి? ఎప్పటికప్పుడు చూసుకొని ట్రాన్స్ కో గానీ, స్టేట్ లో డిస్పాచ్ సెంటర్ గానీ విద్యుత్ కొనుగోలును బ్యాలెన్స్ చేసుకోవచ్చన్నారు. విద్యుత్ ను ఆదా చేసుకునేందుకు ఇదొక అవకాశంగా భావించాలన్నారు.

## టీటీడీకి బ్యాటరీ వాహనం విరాళం

తిరుమల ఐడిబిఐ బ్యాంక్ చైర్మన్ రాకేష్ శర్మ గురువారం ఉదయం టీటీడీకి సుమారు రూ.7.67 లక్షల విలువైన 6-సీట్లు కలిగి బ్యాటరీతో నడిచే ఒక వాహనాన్ని విరాళంగా అందించారు. శ్రీవారి ఆలయం ముందు వాహనానికి పూజలు నిర్వహించిన అనంతరం ఐడిబిఐ బ్యాంక్ చైర్మన్ శ్రీవారి ఆలయ డిప్యూటీ ఈవో రమేష్ బాబుకు బ్యాటరీ వాహనం తాళాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐడిబిఐ బ్యాంక్ ప్రతినిధులు, తిరుమల డిఐ శ్రీ జానకిరామ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పాత గాయాలను గుర్తుచేస్తున్న తమ్ముళ్లు

నెల్లూరు, మార్చి 9, ఇటీవల వైసీపీని విభేదించిన ఎమ్మెల్యే కోటంరెడ్డి ఏ పార్టీలో చేరుతారా అన్నది ఆసక్తికరంగా మారింది. చంద్రబాబు ఆహ్వానిస్తే టీడీపీలో చేరుతానని కోటంరెడ్డి బహిరంగంగానే ప్రకటించారు. అయితే ఆయన ప్రకటనతో కొందరు టీడీపీ నేతల్లో గుబులు మొదలైంది. కోటంరెడ్డి టీడీపీలో చేరడం ఖాయమని చెబుతున్న వేళ కొత్త ట్విస్టులు తెర మీదకు వస్తున్నాయి. శ్రీధర్ రెడ్డి టీడీపీలో చేరితే తమకు ప్రాధాన్యత తగ్గుతుందని పార్టీ నేతల్లో ఆందోళన మొదలైంది. శ్రీధర్ రెడ్డి రాకను ఎలాగైనా అడ్డుకునేందుకు కొందరు టీడీపీ నేతలు వరుస ప్రెస్‌మీట్లు పెట్టి కోటంరెడ్డిని తీవ్రంగా విమర్శిస్తున్నారు. గతంలో టీడీపీ నేతలపై శ్రీధర్ రెడ్డి దాడి చేశారని గుర్తుచేస్తూ ప్రెస్‌మీట్‌లు పెడుతూ పార్టీలో కోటంరెడ్డిపై వ్యతిరేఖత పెరిగేలా చేస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. శ్రీధర్ రెడ్డితో తమకు ప్రాణహాని ఉందని కొందరు టీడీపీ నేతలు ఎస్పీకి ఫిర్యాదు చేయడం ఇప్పుడు హాట్‌టాపిక్‌గా మారింది. చంద్రబాబు నెల్లూరు రూరల్ ఎమ్మెల్యేగా అవకాశం ఇస్తే టీడీపీ నుంచి పోటీ చేస్తానని శ్రీధర్ రెడ్డి చెప్పుకుంటున్నారు. జిల్లా టీడీపీలో మాజీ మంత్రి సోమిరెడ్డి, బీదా రవిచంద్ర, అబ్దుల్ అజీజ్ కీలక పాత్ర పోషిస్తున్నారు. అయితే కోటంరెడ్డి టీడీపీలో చేరితే తమకు ప్రాధాన్యత తగ్గుతుందని ఆందోళన వారిలో మొదలైందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అందుకే తమ అనుచరులతో పాత గాయాలను రేపుతూ వరస ప్రెస్‌మీట్లు పెట్టి కోటంరెడ్డిని తీవ్రంగా విభేదిస్తూ పార్టీలోకి రాకుండా అడ్డుకుంటున్నారన్న టాక్ వినిపిస్తుంది. కోటంరెడ్డి రాజకీయంగా బలమైన నేత, దూకుడుగా వ్యవహరించే వ్యక్తి. శ్రీధర్ రెడ్డి టీడీపీలో చేరితే జిల్లా రాజకీయాల్లో కీలకంగా మారి చక్రం తిప్పగలరు. అప్పుడు సోమిరెడ్డి, బీదా రవిచంద్ర, అబ్దుల్ అజీజ్ వంటి నేతలు జిల్లా పట్టుకోల్పోతామన్న భయంతోనే కోటంరెడ్డిని పార్టీలోకి రాకుండా అడ్డుకుంటున్నారని రాజకీయ విశ్లేషకుల్లో ఓ అభిప్రాయం ఉంది. ఇటీవల శ్రీధర్ రెడ్డిని టీడీపీ నేత అబ్దుల్ అజీజ్ ఉద్దేశిస్తూ మాట్లాడుతూ క్రికెట్ బెట్టింగులు ఆడేవారిని, సింగల్ నెంబర్లు ఆడించేవారిని టీడీపీలోకి ఆహ్వానించేది లేదన్నారు. ఎవరైనా ఇంట్లో పండ్ల, పూల మొక్కలు నాటుకుంటారు కానీ గంజాయి మొక్కలు నాటుకోరు కదా అని ప్రశ్నించారు. టీడీపీ విలువలతో కూడిన పార్టీ అని, దానిలోకి ఎవరిని పడితే వారిని ఆహ్వానించరని చెప్పారు. టీడీపీ నేతలపై దాడులు చేసినవాళ్లు, కార్యకర్తలను కేసులతో వేధించినవాళ్లు, బెట్టింగ్ బాబులు, రియల్ ఎస్టేట్ వ్యాపారుల్ని బెదిరించేవాళ్లు టీడీపీకి అవసరంలేదని తేల్చి చెప్పారు. దీంతో కోటంరెడ్డిపై పరోక్ష ఆరోపణలు చేయడం పార్టీలోకి ఆయన ఎంట్రీ హాట్‌టాపిక్‌గా మారింది. శ్రీధర్ రెడ్డి వచ్చే ఎన్నికల్లో టీడీపీ నుంచి పోటీ చేస్తారని కొంతకాలంగా ప్రచారం సాగుతోంది. చంద్రబాబు లోకేశ్‌తో చర్చలు జరిపాకే కోటంరెడ్డి వైసీపీని టార్గెట్ చేశారని ఆరోపణలు లేకపోలేదు. టీడీపీ అవకాశం ఇస్తే పార్టీ తరఫున రూరల్ నుంచి పోటీ చేస్తానని శ్రీధర్ రెడ్డి భావిస్తున్నారు. సొంత ప్రభుత్వం పైన ఆరోపణలు చేయడానికి ముందే కోటంరెడ్డి చంద్రబాబునుంచిరూరల్ టికెట్ హామీ పొందాలని సమాచారం సాగింది. నెల్లూరులో ఇద్దరు వైసీపీ రెబల్ ఎమ్మెల్యేలు కోటంరెడ్డి, అనం రామనారాయణ రెడ్డి వచ్చే ఎన్నికల్లో టీడీపీ నుంచి పోటీ చేస్తారన్న ప్రచారం ఉన్నా స్థానికంగా మాత్రం ఆ ఇద్దరికీ టీడీపీ నేతల నుంచి మద్దతు లభించడం లేదు.

# శ్రీశైల మహాక్షేత్రంలో దర్శనాలలో మార్పులు



శ్రీశైలం శ్రీశైల మహాక్షేత్రంలో ఉగాది మహోత్సవాలు ఈ నెల 19 నుంచి 23 వరకు జరుగనున్నాయి. ఈ ఉత్సవాలకు కర్ణాటక రాష్ట్రం నుండి ముఖ్యంగా ఉత్తర కర్ణాటక ప్రాంతం నుండి మహారాష్ట్రలోని షోలాపూర్, సాంగ్లీ తదితర ప్రాంతాల భక్తులు తరలివస్తారు. భక్తులందరికీ సౌకర్యవంతమైన దర్శనం కల్పించేందుకుగాను ఉగాది మహోత్సవాలలో భక్తులందరికీ స్వామివారి అలంకార దర్శనం మాత్రమే కల్పించడం జరుగుతుంది. ఉత్సవరోజులలో స్వామివారి స్పర్శదర్శనానికి అవకాశం ఉండదు. అయితే ఉత్సవాలకంటే 10 రోజుల ముందునుంచే భక్తులు శ్రీశైలాన్ని సందర్శిస్తారు. ఈ కారణంగా ఉత్సవాల ముందు నుంచే అనగా 9 నుంచి 18 వరకు నిర్దిష్ట వేళలలో నాలుగు విడతలుగా భక్తులకు శ్రీస్వామివారి స్పర్శదర్శనానికి అవకాశం కల్పించడం జరిగింది. ఈ స్పర్శదర్శనం టికెట్ రుసుము రూ. 500.00లుగా నిర్ణయించబడింది. ఒక్కొక్క విడతలో 1500 టికెట్లు మాత్రమే ఇస్తారు. ఇవ్వబడుతాయి

శ్రీ స్వామివారి స్పర్శదర్శన వేళలు సమయం

మొదటి విడత

ఉ4:30 నుండి ఉ. గం.6.00 వరకు స్వామివారి అలంకార దర్శనం.

ఉ. గం.6.00 నుండి ఉ.గం.8.00 వరకు శ్రీ స్వామివారి స్పర్శదర్శనం 1500. రూపాయలు.

ఉ.గం.8.00 నుండి ఉ.గం.11.30 వరకు శ్రీ స్వామివారి అలంకార దర్శనం

రెండవ విడత

ఉ 11.30 నుండి మ. గం. 1.30 వరకు శ్రీ స్వామివారి స్పర్శదర్శనం 1500రూపాయలు. మ. గం1.30 నుండి సా గం. 4.00 వరకు శ్రీ స్వామివారి అలంకార దర్శనం. శ్రీ స్వామివారి అలంకార దర్శనం కల్పించబడుతుంది.

సా గం. 5:20 నుండి రా.గం. 7.30 వరకు స్వామివారి అలంకార దర్శనం.

మూడవ విడత

రాగం 7.30 నుండి రా. గం.9.30 వరకు శ్రీ స్వామివారి స్పర్శదర్శనం1500 రూపాయలు.

రా. గం 9:30 నుండి రా.గం. 10.30 వరకు స్వామివారి అలంకార దర్శనం.

నాలుగవ విడత

రా గం 10:30 నుండి రా. గం. 11.30 వరకు శ్రీ స్వామివారి స్పర్శదర్శనం 1500రూపాయలు. కాగా భక్తులందరికీ స్పర్శదర్శనం కల్పించినట్లయితే రోజుకు గరిష్ఠంగా 15వేల మందికి మాత్రమే దర్శనాలు కల్పించగలం. అయితే ఉత్సవ రోజులలో రోజుకు సుమారు 60వేల నుంచి 80వేలమంది దాకా భక్తులు ఆలయాన్ని సందర్శించే అవకాశం ఉంటుంది. భక్తులందరికీ సౌకర్యవంతమైన దర్శనం కల్పించేందుకుగాను ఉత్సవ రోజులలో కేవలం శ్రీస్వామివారి అలంకార దర్శనానికి (లఘుదర్శనానికి) మాత్రమే అవకాశం కల్పించబడింది. కాగా ఇప్పటికీ ఈ విషయమై బాగల్ కోట్ జిల్లా రబ్కవిలో కర్ణాటక మరియు మహారాష్ట్రలోని పలు భక్తసంఘాలు, పాదయాత్ర బృందాలు, స్వచ్ఛంద సేవాసంస్థ ప్రతినిధులతో దేవస్థానం. తేది 05.03.2023న సమన్వయ సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది.-భక్తులందరికీ అవగాహన కల్పించేందుకుగాను ఈ సమావేశంలో ఉత్సవరోజులలో దర్శన సంబంధిత ఏర్పాట్ల గురించి భక్త బృందాల ప్రతినిధులకు తెలియజేయడం కూడా జరిగింది. ఈ శ్రీశైల జగద్గురు పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ చెన్నసిద్ధరామశివాచార్య మహాస్వామివారు కూడా సమావేశానికి విచ్చేసి తమ అనుగ్రహభాషణం చేసారు.

# పని ప్రదేశాల్లో మహిళలపై వేధింపు చట్టంపై సమీక్ష

అమరావతి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సచివాలయంలో "పని ప్రదేశంలో మహిళలపై లైంగిక వేధింపుల చట్టం-2013" అమలు తీరు పై రాష్ట్ర మహిళా అభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీ చరణ్, రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ వాసిరెడ్డి పద్మ గురువారం సమీక్షించారు. శాఖధిపతుల కార్యాలయాల్లో ఇప్పటికే ఏర్పాటు చేసిన ఇంటర్నల్ కంప్లైంట్స్ కమిటీలను మరింత బలోపేతం చేయాలనే దిశగా సమీక్ష సమావేశం జరిగింది. పలు శాఖాధిపతుల కార్యాలయాల ఇంటర్నల్ కంప్లైంట్స్ కమిటీల ప్రతినిధులు, అధికారులు, మహిళా అభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ సంచాలకులు బి ప్రకాష్ రెడ్డి, అధికారులు పలువురు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

# సత్తెనపల్లి లో ఫుడ్ కమిషన్ ఛైర్మెన్ ప్రతాప్ రెడ్డి తనిఖీలు

**పాఠశాలలు, ఆగన్వాడి సెంటర్ సందర్శించి పలు సూచనలు**

**అధికారులు ఎవరు కక్కుర్తి పడవద్దు**

పల్నాడు ప్రభుత్వం నిర్వహిస్తున్నపిడియస్, అంగన్వాడీ, యండి.యం.సోషల్ వెల్ఫర్ హాస్టల్స్, పి ఎం .మాతృయోజన పథకం వంటి పథకాలు చిన్న చిన్న పొరపాట్లు జరుగుతున్నాయి. అధికారులు ఎవరు తప్పు చేసినా ఉపేక్షించం. చర్యలు తప్పనిసరిగా ఉంటాయని రాష్ట్ర ఫుడ్ కమిషన్ ఛైర్మన్ ప్రతాప్ రెడ్డి హెచ్చరించారు. గురువారం అయన సత్తెనపల్లిలో పలు చోట్ల తనిఖీల చేసారు. ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల కోసం ప్రభుత్వం కృషి చేస్తుంది. పిడియస్ వ్యవస్థ పై పలు ఫిర్యాదులు రావడం జరిగింది ప్రజల దగ్గర నుంచి డబ్బులు అధికం గా వసులు చేస్తున్నారు. పేదలకు కడుపు నిండే కార్యక్రమాలలో తప్పులు చేయవద్దు. చిన్నారుల కోసం పేదల కోసం పోషక విలువలుగల ఫోర్టిఫైడ్ రైస్ ను ప్రభుత్వం అందిస్తుంది. అధికారులు ఎవరు తప్పు చేసిన తక్షణమే సస్పెండ్ చేస్తామని అన్నారు.

# ఇంటింటికీ వెళ్లి ఓట్లు వెరిఫై చేసిన నారాయణ


తిరుపతి, మార్చి 9, దొంగ ఓట్ల నమోదు కోసం ఓ మహిళకు 18 మంది భర్తలు ఉన్నట్లు నమోదు చేయడం సిగ్గుచేటని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ విమర్శించారు. దొంగఓట్ల నమోదు అనుమతించిన అధికారులను బహిరంగంగా ఉరి తీసినా పాపం లేదని ఫైర్ అయ్యారు. పట్టభద్రుల ఎన్నికల్లో చదువు అర్హత కల్గిన వారికి ఓటు హక్కు కల్పించకపోగా... అర్హత లేని వారి పేర్లతో జాబితా సిద్ధం చేయడం దారుణం అన్నారు. నారాయణ తిరుపతిలో ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ల జాబితాను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ క్రమంలోనే స్థానిక యశోద నగర్ లో ఓ ఇంట్లో 30, వాలంటీర్ ఇంట్లో 12, మరో ఇంట్లో 8 దొంగ ఓట్లు ఉన్నాయంటూ నారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే సీఎం జగన్ ప్రజాస్వామ్యాన్ని రోడ్డుపై నిలబెట్టి అపహాస్యం చేస్తున్నారని, అరాచక పాలనకు అంతేకాకుండా పోయిందని విమర్శించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటమి భయం పట్టుకున్న అధికార పార్టీ దొంగ ఓట్లక తెరలేపిందన్నారు. ఎన్నికల్లో దొంగ ఓట్లు వేసేందుకు వచ్చే వారి కాళ్లు విరగ్గొట్టాలని సూచించారు. దొంగ ఓటర్ల జాబితా, అర్హత కల్గిన వారికి ఓటు హక్కు కల్పించక పోవడంపై న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని... ఎన్నికల కమిషన్ కు ఫిర్యాదు చేస్తామని పేర్కొన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీడీఎఫ్ అభ్యర్థులు విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో దొంగ ఓటర్ల నమోదు చేశారన్న అంశంపై తీవ్ర ఆరోపణలు వస్తున్నాయి. ముఖ్యంగా రాయలసీమలోని రెండు పట్టభద్రుల నియోజకవర్గాల్లో ఓటర్ల జాబితాలో అవకతవకలు ఉన్నాయని టెన్త్ పాస్ కాని వాళ్లను కూడా ఓటర్లుగా చేర్చి ఓట్లు వేయించే ప్రయత్ం చేస్తున్నారని విపక్ష పార్టీలు ఆరోపిస్తున్నాయి. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రులను గెలిపించుకునేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్న వివిధ పార్టీల నేతలు పెద్ద ఎత్తున ఈ దొంగ ఓట్ల వ్యవహారంపై విమర్శలు గుప్పిస్తున్నారు. రాయలసీమలో పట్టభద్రుల బీజేపీ అభ్యర్థుల తరపున విస్తృతంగా ప్రచారం చేస్తున్న ఏపీ బీజేపీ ప్రధాన కార్యదర్శి విష్ణువర్ధన్ రెడ్డి కూడా ఈ అర్హత లేని ఓటర్ల అంశాన్ని ప్రధానంగా గుర్తించారు. రెండు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటర్లలో అనేక అక్రమాలు ఉన్నాయని ఆరోపిస్తున్నారు. నిబంధనల ప్రకారం పట్టభద్రులకే? ఓటర్లుగా నమోదు చేయాలి. కానీ ఫేక్ డిగ్రీ సర్టిఫికెట్లతో.. కొంత మంది అవినీతి అధికారుల సంతకాలతో దుర్వినియోగానికి పాల్పడి మరీ అర్హత లేని వారిని ఓటర్లుగా నమోదు చేశారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనిపై విష్ణువర్ధన్ రెడ్డి ఎన్నికల సంఘం తీరుపై మండిపడ్డారు. రెండు చోట్ల వైఎస్ఆర్‌సీపీ పెద్ద ఎత్తున దొంగ ఓట్లను నమోదు చేసిందని.. దీనికి సచివలాయ, వాలంటీర్ వ్యవస్థలను వాడుకున్నారని ఆరోపణలు గుప్పించారు.

# స్కిల్ డెవలప్ మెంట్ కేసులో కొత్త పేర్లు

విజయవాడ, మార్చి 9,ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ అర్జా శ్రీకాంత్‌కు నోటీసులిచ్చేందుకు ఏపీ సిఐడి సిద్దమవుతోంది. గత కొన్నేళ్లుగా స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ వ్యవహారంలో భారీగా అక్రమాలు జరిగాయనే ఆరోపణలతో ప్రభుత్వం దర్యాప్తు చేస్తోంది. ఈ నేపథ్యంలో త్వరలో మరికొందరికి నోటీసులు, కీలక వ్యక్తుల అరెస్ట్‌లకు సిఐడి సన్నద్ధం అవుతున్నట్లు తెలుస్తోంది. టీడీపీ అధికారంలో ఉన్న సమయంలో నైపుణ్యాభివృద్ధి శిక్షణ పేరుతో భారీగా అక్రమాలు జరిగాయని సిఐడి ఆరోపిస్తోంది. అప్పటి సీమెన్స్ ఇండియా హెడ్‌గా ఉన్న సుమన్ బోస్ సహకారంతో అక్రమాలకు పాల్పడినట్లు గుర్తించారు. ఈ వ్యవహారంలో ఏపీ సీఐడీ అధికారులకు గ్లోబల్ సీమెన్స్ సంస్థ ఆధారాలను అందజేసింది. దాదాపు రూ. 240 కోట్లు షెల్ కంపెనీలకు మళ్లించినట్టు సిఐడి గుర్తించింది. ఏపీ స్కిల్‌డెవలప్‌మెంట్ కుంభకోణం కేసు కీలక మలుపు తిరగబోతున్నట్లు ప్రచారం జరుగుతోంది. వందల కోట్ల అక్రమాలకు సంబంధించిన స్కామ్‌లో కీలకమైన వ్యక్తుల అరెస్టులకు రంగం సిద్ధమవుతోంది. ఈ కేసులో సీఐడీ విచారణలో మరిన్ని ఆధారాలు వెలుగు చూశాయి. త్వరలోనే మరి కొంతమందికి నోటీసులు ఇవ్వడంతోపాటు కీలక వ్యక్తుల అరెస్ట్‌లకు సీఐడీ సన్నద్ధం అవుతోందని తెలుస్తోంది. స్కిల్‌డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీగా పనిచేసిన అర్జా శ్రీకాంత్‌కు నోటీసులు జారీ చేసేందుకు సీఐడీ సిద్ధమవుతోంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ సంస్థలో వెలుగులోకి వచ్చిన ఈ కుంభకోణంలో చంద్రబాబుతో పాటు ఆయన బినామీల పాత్ర ఉందని అధికార పార్టీ చాలాకాలంగా ఆరోపిస్తోంది. చంద్రబాబు హయాంలో రాష్ట్రంలో యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇస్తామంటూ రూ.3300 కోట్లకు సీమెన్స్ సంస్థ - డిజైన్‌టెక్ సంస్థలు ఒప్పందం చేసుకున్నాయి. ఇందులో ప్రభుత్వం 10శాతం నిధులు, మిగిలిన 90 శాతం సీమెన్స్ సంస్థ చెల్లించేలా ఒప్పందం జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం తరపున 10శాతం వాటాగా జీఎస్టీతో కలిపి రూ.370 కోట్లను చంద్రబాబు ప్రభుత్వం చెల్లించింది. ప్రభుత్వం చెల్లించిన రూ.370 కోట్లలో రూ.240 కోట్ల రూపాయలను సీమెన్స్ సంస్థ పేరుతో కాకుండా డిజైన్‌టెక్ సంస్థకు బదలాయించారుమరోవైపు ఈ కుంభకోణానికి తమకు ఎలాంటి సంబంధంలేదని గ్లోబల్ సీమెన్స్ సంస్థ ప్రకటించింది. తమ సంస్థ పేరుతో తమ ఉద్యోగులే అక్రమాలకు పాల్పడినట్టు తమ ఇంటర్నల్ ఆడిట్‌లో గుర్తించినట్టు సీమెన్స్ సంస్థ సీఐడీ అధికారులకు ఆధారాలు సమర్పించింది. రాష్ట్ర ప్రభుత్వం కట్టిన రూ. 370 కోట్లలో రూ.240 కోట్లను వేర్వేరు షెల్ కంపెనీలకు మళ్లించినట్టు సీఐడీ అధికారులు నిగ్గుతేల్చారు. ఎలైట్ కంప్యూటర్స్, స్కిల్లర్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్, నాలెడ్జ్ పోడియం, ఈటీఏ- గ్రీన్స్, కేడన్స్ పార్ట్‌నర్ తదితర కంపెనీలకు నిధులు మళ్లించారు. నాడు సీమెన్స్ సంస్థ ఇండియా హెడ్‌గా ఉన్న సుమన్ బోస్, డిజైన్‌టెక్ సంస్థ ఎండీగా ఉన్న వికాస్ కన్విల్కర్ ద్వారా కుంభకోణం నడిపించినట్టు సీఐడీ విచారణలో వెలుగుచూసింది. నిజానికి రూ.3300 కోట్ల ప్రాజెక్టుగా ఎంఓయూ చేసుకున్న చంద్రబాబు ప్రభుత్వం.. జీవోలో మాత్రం రూ.3300 కోట్ల ప్రస్తావనను తొలగించింది. చివరకు రూ.240 కోట్ల రూపాయలను షెల్ కంపెనీల ద్వారా మళ్లించేశారని ఆరోపిస్తోంది. ఈ కుంభకోణం 2016- 2018 మధ్య జరిగింది. దీనిపై గతంలోనే ఏసీబీకి పలువురు ఫిర్యాదు చేశారు. దీంతో అప్పటిప్రభుత్వం ఒప్పందానికి సంబంధించిన అసలు ఫైళ్లను మాయం చేశారనే ఆరోపణలు ఉన్నాయి.

అధికారులను మేనేజ్ చేసే సమయంలో.. కేంద్రం ప్రభుత్వ జీఎస్టీ అధికారుల దర్యాప్తులో అసలు కుట్ర బయట పడింది. దీంతో ఈ స్కామ్‌పై కేంద్రం ఆదాయపుపన్ను శాఖ కూడా ప్రత్యేకంగా దృష్టి సారించింది. ఈ వ్యవహారంపై అప్పటికే విచారణ జరుపుతున్న రాష్ట్ర సీఐడీ అధికారులు ఈ సంస్థలన్నింటితో సీఐడీ అధికారులు కో-ఆర్డినేట్ చేకుని విచారణ జరిపారు. మరోవైపు గ్లోబల్ సంస్థ సీమెన్స్ ఇంటర్నెల్ టీంకూడా తమ కంపెనీ పేరుమీద మోసాలకు పాల్పడ్డారని.. తమకు ఎలాంటి సంబంధం లేదని పూర్తి ఆధారాలను సీఐడీకి అందజేసింది. ఈ కుంభకోణానికి సహకరించిన ఆనాటి అధికారులు కూడా కోర్టుకు ముందుకు వచ్చి స్టేట్‌మెంట్లు ఇచ్చారు. ఈ మేరకు త్వరలోనే స్కిల్‌డెవలప్మెంట్ కుంభకోణంలో పెద్దస్థాయిలో అరెస్టులకు సీఐడీ సిద్ధం అవుతోందని తెలుస్తోంది. మరోవైపు స్కిల్ డెవలప్‌మెంట్ వ్యవహారంలో తనకు సంబంధం లేదని మాజీ ఎండి అర్జా శ్రీకాంత్ స్పష్టం చేశారు. స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఎండిగా మార్చి 2019లో జాయిన్ అయ్యానని చెప్పారు. సీమెన్స్ వ్యవహారంజరిగిన 2014 - 2017 మధ్య కాలంలో తాను ఏపీ భవన్‌లో కమిషనర్ గా విధుల్లో ఉన్నానని చెప్పారు. ప్రస్తుత ప్రభుత్వంలో సిఐడి అధికారులు తనను వివరాలు అడిగారని వివరించారు. సీమెన్స్ విభాగానికి చెందిన అన్ని వివరాలు క్రోడీకరించి సిఐడి వారికి అంద చేశానని స్పష్టం చేశారు. స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఎండీ హోదాలో 2019 మార్చికి ముందు టైంలో వ్యవహారాలపై విచారణ చేసి నివేదిక ఇచ్చానని వెల్లడించారు.

# స్కిల్ డెవలప్ మెంట్ పై కోర్టును ఆశ్రయిస్తా



విజయవాడ, మార్చి 9,ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌పై టీడీపీ సీనియర్ నేత పయ్యావుల కేశవ్ సవాల్ విసిరారు.. టీడీపీకి చెందిన ఎవరెవరి ఖాతాలకు స్కిల్ డెవలప్‌మెంట్ నిధులు వెళ్లాయో వివరాలు విడుదల చేయగలరా..? అంటూ ఛాలెంజ్ చేశారు. నిధుల విడుదలకు సంతకం చేసిన ప్రేమ్ చంద్రారెడ్డి ప్రస్తావన ఎందుకు తీసుకురావడం లేదంటూ ప్రశ్నించారు. ప్రభుత్వ ఆలోచనలకు భిన్నంగా అర్జా శ్రీకాంత్ నివేదిక ఇచ్చారన్న పయ్యావుల. సీమెన్స్ సంస్థతో కుదుర్చుకున్న ఒప్పందం.. సాఫ్ట్‌వేర్ వాల్యూయేషన్ సర్టిఫికేషన్ డాక్యుమెంట్లను మీడియాకు విడుదల చేశారు.. పిల్లల భవిష్యత్ కోసం స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ల ఏర్పాటుకు సీమెన్స్ సంస్థతో ఒప్పందం కుదుర్చుకున్నాం.. ప్రభుత్వం కట్టుకథలతో లేనిపోని ఆరోపణలు చేస్తుందని మండిపడ్డారు.. సీమెన్స్ సంస్థతో ఒప్పందం పేరుతో టీడీపీ పెద్దల ఖాతాల్లోకి నిధులు మళ్లించారనే ఆరోపణలు చేస్తున్నారు.. ఏయే ఖాతాలకు నిధులు వెళ్లాయో.. ఆ వివరాలు వెల్లడించండి.. ఖాతాల నెంబర్లను విడుదల చేయండి..? అంటూ బహిరంగ సవాల్ విసిరారు. సీమెన్స్ సంస్థకు నిధులు విడుదల చేస్తూ ప్రేమ్ చంద్రారెడ్డి సంతకం చేశారు. ప్రేమ్ చంద్రారెడ్డి పేరు ఎందుకు ప్రస్తావించడం లేదు..? అని ప్రశ్నించారు పయ్యావుల.. ప్రేమ్ చంద్రారెడ్డి ఏమైనా నాటి సీఎం చంద్రబాబు చెబితే సంతకం చేశానని చెప్పారా..? అని నిలదీశారు.. ప్రేమ్ చంద్రారెడ్డి కూడా ఆషామాషీగా నిధుల విడుదల చేయలేదు. సాఫ్ట్‌వేర్ వాల్యూయేషన్ చేయించి.. సర్టిఫికేషన్ చేయించిన తర్వాతే నిధులు విడుదల చేశారు. సాఫ్ట్ వేర్ వాల్యూయేషన్ చేసింది కేంద్ర రంగ సంస్థే.. సాఫ్ట్‌వేర్ వాల్యూయేషన్ చేయించిన విషయాన్ని ఈ ప్రభుత్వం ఎందుకు చెప్పడం లేదు..? అని మండిపడ్డారు. సీమెన్స్ వ్యవహారంపై అర్జా శ్రీకాంత్‌ను ఈ ప్రభుత్వం నివేదిక అడిగింది. స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లల్లో అధ్యయనం చేసి వచ్చి.. అంతా బాగుందని అర్జా శ్రీకాంత్ నివేదిక ఇచ్చారని తెలిపారు. అర్జా శ్రీకాంత్ ఇచ్చిన నివేదిక ప్రభుత్వ పెద్దలకు నచ్చలేదు.. ఇప్పుడు మరోసారి అర్జా శ్రీకాంత్‌ను విచారణ పేరుతో పిలిచి కొట్టి తమకు అనుకూలంగా నివేదిక ఇప్పించుకుంటారా..? అని ఆగ్రహం వ్యక్తం చేశారు పయ్యావుల కేశవ్.. స్కిల్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ కట్టు కథలు మళ్లీ మొదలు పెట్టారు. ఏదో పెద్ద స్కామ్ జరిగినట్టు చెప్పుకొస్తున్నారు. గత నాలుగేళ్లుగా చెప్పిన కథలే మళ్లీ చెబుతున్నారు. గుజరాత్ రాష్ట్రంతో సీమెన్స్ సంస్థ ఒప్పందం కుదుర్చుకుంది.. దాన్ని అధ్యయనం చేసి ఏపీ ఒప్పందం కుదుర్చుకుందని వివరించారు. గుజరాత్ సహా ఆరు రాష్ట్రాల్లో సీమెన్స్ సంస్థ ఒప్పందాలు కుదుర్చుకుంది. సీమెన్స్ సంస్థపై జీఎస్టీ విషయంలో ఆరోపణలు వచ్చాయి. 170కు పైగా దేశాల్లో సీమెన్స్ సంస్థ కార్యాకలాపాలు ఉన్నాయి. సీమెన్స్ సంస్థ చంద్రబాబు బినామీ సంస్థ అన్నట్టు ప్రచారం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. పది శాతం రాష్ట్ర ప్రభుత్వం భరిస్తే.. మిగిలిన మొత్తాన్ని సీమెన్స్ సంస్థ భరించాలి. ఒప్పందాన్ని సరిగ్గా చదువుకుని విమర్శలు చేస్తే మంచిదని సూచించారు. కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం స్కిల్ డెవలప్‌మెంట్ తరగతుల పర్యవేక్షణ చేపట్టాల్సిన బాధ్యత సీమెన్స్‌దే.. సీమెన్స్ సంస్థకు చెందిన సుమన్ బోస్, డిజైన్ టెక్ సంస్థకు వికాస్ మధ్య లావాదేవీలు జరిగాయి.. దానికీ టీడీపీకి ఏం సంబంధం..? అని నిలదీశారు. జగన్‌పై గతంలో మేం ఆధారాలతో ఆరోపణలు చేశాం. ఆధారాల్లేకుండా ఇప్పుడు ఆరోపణలు చేస్తే కోర్టులకు వెళ్తామని హెచ్చరించారు పయ్యావుల కేశవ్.

## జగ్గయ్యపేట కేంద్రం గా గంజాయి అమ్మకాలు

జగ్గయ్యపేట జగ్గయ్యపేట లో గంజాయి అమ్ముతున్న నల్గురు యువకులను పోలీసులు అరెస్ట్ చేసారు. హైదరాబాద్ నుండి గంజాయి కొనుగోలు చేసి జగ్గయ్యపేట కేంద్రం గా చుట్టుపక్కల గ్రామాలకు కోదాడ ప్రాంతాలకు అమ్ముతున్న ఐదుగురి పై కేసు నమోదు చేసారు. గంజాయి ని చిన్న చిన్న పొట్లాలలో కూర్చి అమ్ముతున్నట్లు గుర్తించారు. ముఠాలోని ఒకరు పరారీ లో ఉన్నాడు. అతన్ని త్వరలో పట్టుకుంటామంటున్నారు జగ్గయ్యపేట పోలీసులు. రోహిత్ గంజాయి అమ్మకాలలో ప్రధాన నిందితుడని, గంజాయి చైన్ లింక్ ను చెదిస్తామని అంటున్నారు.

# వైసీపీలో కొత్త జోనల్ ఇంచార్జీలు

విజయవాడ, మార్చి 9,175 స్థానాల్లో వైఎస్ఆర్‌సీపీ విజయం సాధించాలని టార్గెట్ పెట్టుకున్న సీఎం జగన్ ఆ దిశగానే కీలక నిర్ణయాలు తీసుకుంటున్నారు. క్షేత్రస్థాయిలో మరింత బలోపేతమై... ఓటు బ్యాంకుతోపాటు బలమైన కేడర్‌ను నిర్మించుకునేలా ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే యాభై కుటుంబాలకు ఒకరు చొప్పున 5.20 లక్షల గృహసారథులను నియమించారు. ఇప్పుడు అలాంటిదే మరో నిర్ణయం తీసుకున్నారు. వచ్చే ఎన్నికలు వైసీపీకి చాలా కీలకం. అందుకే గెలుపు గుర్రాలను మాత్రమే పెట్టాలని పార్టీ భావిస్తోంది. ఎలాంటి ప్రయోగాలకు తావులేకుండా కచ్చితంగా గెలిచేవారికే టికెట్లు ఇస్తామంటూ తేల్చి చెప్పేశారు. ఈసారి వారసులకు నో సీట్ బోర్డు పెట్టేశారనే టాక్ పార్టీలో వినిపిస్తోంది. కొందరు సీనియర్ తమను ఈసారి తప్పించి వారసులకు లైన్ క్లియర్ చేయాలంటూ చేసిన రిక్వెస్ట్‌లను జగన్ తిరస్కరించాలన్న మాట గట్టిగానే వినిపించింది. వారసులను కచ్చితంగా ప్రమోట్ చేయాలన్న డిమాండ్ పార్టీలో గట్టిగా వినిపిస్తున్న టైంలో పార్టీలో జోనల్ వ్యవస్థను తీసుకొచ్చారు. 26 జిల్లాలను 8 జోన్లుగా విభజించి దానికి ఇన్‌ఛార్జ్‌లను పెట్టనున్నారు. ఇందులో కూడా వివిధ విభాగాలు ఏర్పాటు చేసి ప్రజాప్రతినిధులకు, క్యాడర్‌కు, ప్రజలకు మధ్య సమాచార లోపం లేకుండా చేయడంతోపాటు ప్రభుత్వం చేపట్టే కార్యక్రమాలపై విస్తృత ప్రచారం కల్పించనున్నారు. ఈ జోన్ల కారణంగా వైసీపీలో ఇప్పుడిప్పుడే వృద్ధిలోకి వస్తున్న సెకండ్ క్యాడర్‌ను ప్రోత్సహించినట్టు అవుతుందని జగన్ ఆలోచన. దీనికి తోడు వారుసులకు గుర్తింపు దొరుకుతుందన్న భావన నేతల్లో కల్పించేందుకు ఇలా ప్లాన్ చేశారట. ఇటు పార్టీకి ప్రచారంతోపాటు తమకు పదవులు దక్కడం లేదన్న అభిప్రాయం ద్వితయ స్థాయి లీడర్లలో లేకుండా చూస్తున్నారట. 26జిల్లాలను 8జోన్లుగా విభజించి ఒక్కో జోన్‌కు ఇన్‌ఛార్జ్‌లను పెట్టనున్నారు. అలా 150 మంది జోనల్ ఇన్‌ఛార్జ్‌లను నియమించనుంది వైసీపీ. ఇప్పటికే కొందరి పేర్లను కూడా ప్రకటించేసిందన్న మాట వినిపిస్తోంది. దీనిపై ఇంత వరకు అధికారికంగా ఎలాంటి ప్రకటన చేయలేదు. కానీ ఆ జోన్‌లలో పని చేసుకోవాలంటూ ఆయా లీడర్లకు సూచనలు చేసినట్టు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఒక్కో జోన్‌లో మూడు నుంచి ఐదు జిల్లాలు ఉండేలా చూస్తున్నారు. మళ్లీ ఇందులో యువజన విభాగం, రైతు విభాగం, బీసీ సెల్, వైఎస్ఆర్‌టీయూసీ, పంచాయత్ రాజ్ సెల్, విద్యార్థి విభాగం , వైద్య విభాగం, మైనారిటీ సెల్ ఇలా విభాగాలు చేయనున్నారు. దీనికి ఒక్కో ఇన్‌ఛార్జ్‌ను పెట్టనున్నారు. ఆయా విభాగాల్లోకి వచ్చిన ప్రజలకు, కేడర్‌కు, ఎమ్మెల్యేలు, ఎంపీలకు వీళ్లు అనుసంధాన కర్తలుగా ఉంటూనే పార్టీ తరఫున ప్రచార కార్యక్రమాల్లో పాల్గొంటారు. 26 జిల్లాలను ఎనిమిది జోన్లగా విభజించారు. ఇందులో యువతకే అవకాశం కల్పిస్తారు. ఇందులో వారసులకు ఎక్కువ అవకాశం ఇచ్చే ఛాన్స్ ఉందట. చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి కుమారుడు మోహిత్ రెడ్డి, పేర్ని నాని కుమారుడు కృష్ణమూర్తి, మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సోదరుడు పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి ఇలా కొంతమందికి యూత్ వింగ్ బాధ్యతలు అప్పగించారని టాక్. కృష్ణా, గుంటూరు, ఎన్టీఆర్ జిల్లాల జోనల్ యూత్ వింగ్‌కు ఇన్‌ఛార్జ్‌గా పేర్ని కృష్ణమూర్తిని నియమించారు. నెల్లూరు, వైఎస్ఆర్ కడప, తిరుపతి జిల్లాల యూత్ వింగ్‌కు మోహిత్ రెడ్డిని, పల్నాడు, బాపట్ల, ప్రకాశం జోన్ యూత్ వింగ్‌కు వెంకట్రామిరెడ్డిని నియమించినట్టు తెలుస్తోంది. మిగతా జిల్లాల యూత్ వింగ్ ఇన్‌ఛార్జ్‌లుకాకినాడ, కోనసీమ, తూర్పు , పశ్చిమగోదావరి-జక్కంపూడి గణేష్ విజయనగరం, విశాఖ, అనకాపల్లి- ఎం సునీల్ కుమార్ శ్రీకాకుళం, పార్వతీపురం, అల్లూరి సీతారామరాజు-అవనపు విక్రమ్ కర్నూలు, నంద్యాల- మధుసూదరన్ రెడ్డి అనంతపురం, సత్యసాయి, అన్నమయ్య-ఎల్లారెడ్డి ప్రణయ్ రెడ్డి ఇలా వైద్యులు, ఎస్టీ, మైనార్టీ, బీసీల వింగ్‌లను ఏర్పాటు చేసి ఇన్‌ఛార్జులను నియమించనున్నారు. ఇలా అందర్నీ సమన్వయం చేసుకొని కచ్చితంగా 175 గెలుచుకునేలా జగన్ ఎన్నికల వ్యూహాన్ని సిద్ధం చేశారు.

# ఎర్రచందనం స్మగ్లింగ్

**సిబిఐ విచారణకు వివరాలు కోరిన కేంద్రం ప్రభుత్వం**

**ఎర్రచందనంపై తొలిసారిగా స్పందించిన కేంద్ర ప్రభుత్వం**

బద్వేలు రాష్ట్రంలోని తిరుమల శేషాచలం అడవులతో పాటు బద్వేలు మైదుకూరు నియోజకవర్గాల పరిధిలోని లంక మల్ల అభయారణ్యంలో తోపాటు అనేక ప్రాంతాల్లో అక్రమంగా ఎర్రచందనం స్మగ్లింగ్, చట్ట విరుద్ధ కార్యకలాపాలపై సీబీఐ విచారణ చేపట్టాలని గతంలో న్యూఢిల్లీలో కేంద్ర అటవీ,పర్యావరణ శాఖ మంత్రి భూపేంద్ర యాదవ్ కు ఒకరు వినతి పత్రం ఇవ్వడం జరిగింది. రెండు రోజుల క్రితం కేంద్ర ప్రభుత్వం తొలిసారిగా తీవ్రంగా స్పందించి ఎర్రచందనం స్మగ్లింగ్ నివారణ చర్యలపై రాష్ట్ర ప్రభుత్వాన్ని వివరాలు అందజేయాలని అసిస్టెంట్ ఇన్స్పెక్టర్ జనరల్ ఆఫ్ ఫారెస్ట్ శివానంద్ ఎస్ తలావార్ ఆదేశించారు. ఎర్రచందనం శేషాచలం అడవులతో పాటు కడప, చిత్తూరు, నెల్లూరు, ప్రకాశం, కర్నూలు జిల్లాల్లో విస్తరించి ఉంది. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయ వ్యవహారాలను నిర్వహించడానికి తిరుమల- తిరుపతి దేవస్థానం స్థాపించబడినది. టీటీడీ ముఖ్యమైన ఆస్తుల్లో శేషాచలం అడవులు ఒకటి. అంతర్జాతీయంగా ఎర్రచందనంకు విలువ అధికంగా ఉండడంతో ఆంధ్రప్రదేశ్ లోని శేషాచలం అడవుల్లో ఎర్రచందనం నరకి, స్మగ్లింగ్ కార్యకలాపాల ద్వారా పర్యావరణ వ్యవస్థకు తీవ్ర నష్టం కలుగుతోంది. ఈ అక్రమ వ్యాపారంవల్ల నేరాలు పెరగడం, ఉగ్రవాదానికి నిధులు వెళ్తున్నట్లు ఉన్న అనుమానాలతో ఇది దేశ భద్రతకు ముప్పు కలిగిస్తుందని, వెంటనే స్మగ్లింగ్ అరికట్టి, స్మగ్లర్లను కఠినంగా శిక్షించేలా సమర్థవంతమైన చర్యలు తీసుకోవాలని కోరడం జరిగింది. వెంకటేశ్వర స్వామికి చెందిన వేలకోట్ల ఎర్ర చందనం అక్రమ రవాణాను అరికట్టడానికి, అక్రమ కార్యకలాపాలను వెలికి తీసి క్లిష్టమైన ఈ సమస్యను పరిష్కరించేందుకు సీబీఐ విచారణకు ఆదేశించాలని మంత్రిని కోరగా మంత్రి భూపేంద్ర యాదవ్ తీవ్రంగా స్పందించడం అభినందనీయం. ఫిర్యాదు మేరకు న్యూఢిల్లీ అసిస్టెంట్ ఇన్స్పెక్టర్ జనరల్ ఆఫ్ ఫారెస్ట్ శివానంద ఎస్ తలావార్ మంగళవారం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ వారికి వివరాలు కోరుతూ ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రంలో ఎర్రచందనం స్మగ్లింగ్ ను అరికట్టడంలో ప్రస్తుతం ఉన్న చట్టాలు, నియమాలు, నిబంధనలు పరిశీలించి మీరు తీసుకున్న చర్యలను, ప్రాథమిక వివరాలను కేంద్ర మంత్రిత్వ శాఖకు పంపాలని ఉత్తర్వులు జారీ చేశారు. కేంద్ర ప్రభుత్వం మొట్టమొదటిసారిగా ఎర్రచందనం స్మగ్లింగ్ పై విచారణ కోరడం హర్షనీయం . రాష్ట్ర ప్రభుత్వ వివరాల మేరకు త్వరలోనే సిబిఐ విచారణకు కేంద్ర ప్రభుత్వం ఆదేశించడం జరుగుతుందని, ఎర్రచందనం స్మగ్లర్లను నిరోధించి, శేషాచలం అడవులను కాపాడేందుకు ఇది తొలిమెట్టు. సి.బి.ఐ విచారణలతో బడా స్మగ్లర్లు, వారికి సహకరిస్తున్న ప్రభుత్వ పెద్దలు, తదితర వివరాలన్నీ బహిర్గతం కావడానికి సమయం దగ్గరలోనే ఉందని చెప్పాలి



# సమిష్టి కృషితో శ్రీ కోదండరామస్వామిబ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలి

బద్వేలు టీటీడీ లోని అన్ని విభాగాలు, జిల్లా యంత్రాంగం, పోలీసులు సమష్టి కృషి చేసి ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామిబ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని టీటీడీ ఈవో ఎవి ధర్మారెడ్డి అధికారులను కోరారు. బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై వై ఎస్ ఆర్ జిల్లా కలెక్టర్ విజయరామరాజు, జిల్లా ఎస్ పి అన్బురాజన్, జిల్లా యంత్రాంగంతో గురువారం ఒంటిమిట్ట లో ఈవో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ, గతంలో జరిగిన లోటుపాట్లను సవరించుకుని శ్రీ సీతారాముల కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించాలన్నారు. టీటీడీ అధికారులు, జిల్లా అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. అన్ని విభాగాల అధికారులు సమన్వయం చేసుకుని బ్రహ్మోత్సవ ఏర్పాట్లను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ నెల 16వ తేదీ మరోసారి పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించనున్నట్లు ఈవో వివరించారు. మార్చి 30వ తేదీ శ్రీరామనవమితో స్వామివారి బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. ఏప్రిల్ 3వ తేదీ హనుమంత వాహనం, ఏప్రిల్ 4వ తేదీ గరుడవాహనం, ఏప్రిల్ 5వ తేదీ సీతారాముల కల్యాణాన్ని అత్యంత అద్భుతంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. శ్రీ సీతారాముల కల్యాణానికి రాష్ట్ర ప్రభుత్వం తరపున ముఖ్యమంత్రి శ్రీ వైయస్ జగన్మోహన్ రెడ్డి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పిస్తారని తెలిపారు. ఏప్రిల్ 6న రథోత్సవము, ఏప్రిల్ 7న చక్రస్నానం, ఏప్రిల్ 8న పుష్పయాగము జరుగుతాయని చెప్పారు. వై ఎస్ ఆర్ జిల్లా కలెక్టర్ శ్రీ విజయరామరాజు

**- సీతారాముల కల్యాణానికి విచ్చేసే భక్తుల సౌకర్యార్థం విస్తృత ఏర్పాట్లు**

**- ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి బ్రహ్మోత్సవాల పోస్టర్లు ఆవిష్కరించిన టీటీడీ ఈవో ఎవి ధర్మారెడ్డి, జిల్లా కలెక్టర్ విజయరామరాజు**

మాట్లాడుతూ, బ్రహ్మోత్సవాల్లో ప్రధానంగా శ్రీ సీతారాముల కల్యాణానికి విచ్చేసిన భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా జిల్లా యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేపట్టనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా భద్రత, పార్కింగ్, అన్నప్రసాదాల పంపిణీ, తాత్కాలిక మరుగుదొడ్లు, నిరంతర విద్యుత్ సరఫరా, ప్రథమ చికిత్స కేంద్రాలు, ఆర్టీసీ బస్సులు, హెల్ప్ డెస్క్ లు, సైన్ బోర్డులు, పారిశుధ్యం, పబ్లిక్ అడ్రస్ సిస్టం విభాగాలు ఈ నెల 16వ తేదీ లోపు తమ కార్యాచరణ ప్రణాళికలను అందించాలన్నారు. అంతకుముందు టీటీడీ ఈవో, వై ఎస్ ఆర్ జిల్లా కలెక్టర్ తో కలిసి శ్రీ కోదండరామ స్వామి బ్రహ్మోత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ జేఈవో వీర బ్రహ్మం, వై ఎస్ ఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్ సాయి కాంత్ వర్మ , ఎస్వీబీసీ సిఈవో షణ్ముఖ కుమార్ , టీటీడీసిఈ ఎలక్షన్ కాదా రేషన్ గోదని నాగేశ్వరరావు జిల్లా యంత్రాంగానికి చెందిన వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

# కర్నూలులో దారుణం..

**జాతరలో అందరూ చూస్తుండగానే అల్లుడిని నరికి చంపిన మామ**

**పి.కోటకొండలో పట్టపగలే ఘటన**

**ఇద్దరి మధ్య గత కొంతకాలంగా గొడవలు**

**అల్లుడి హత్యకు ముందే పథకం**

**పోలీసుల బందోబస్తు ఉన్నప్పటికీ దారుణం**

కర్నూలు జిల్లాలో దారుణం జరిగింది. జాతరకొచ్చిన అల్లుడిని అందరూ చూస్తుండగానే మామ కత్తితో నరికి చంపాడు. దేవనకొండ మండలం పి.కోటకొండలో పట్టపగలే జరిగిన ఈ ఘటనతో జాతరకొచ్చిన వారు భయభ్రాంతులకు గురయ్యారు. గ్రామానికి చెందిన లింగమయ్య, అతడి అల్లుడు సూర్యప్రకాశ్ (23) మధ్య గత కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో నిన్న జాతరకొచ్చిన అల్లుడిపై లింగమయ్య కత్తులతో దాడిచేశాడు. అల్లుడి హత్యకు ముందే ప్లాన్ చేసుకున్న లింగమయ్య కత్తులతోనే జాతరకొచ్చాడు.బందోబస్తు ఉన్నప్పటికీ..జాతరలో సూర్యప్రకాశ్ కనిపించగానే లింగమయ్య ఒక్కసారిగా కత్తులతో విరుచుకుపడ్డాడు. అందరూ చూస్తుండగానే అతడిపై దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన సూర్యప్రకాశ్ అక్కడికక్కడే మృతి చెందాడు. జాతర కోసం పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేసినప్పటికీ ఈ ఘటన జరగడం గమనార్హం. కేసు నమోదు చేసుకున్న పోలీసులు లింగమయ్యను అరెస్ట్ చేసినట్టు తెలుస్తోంది.

# ఐదు సచివాలయాలు నంద్యాల మున్సిపాల్టీ లో మెర్జ్

నంద్యాల గురువారం మున్సిపల్ కార్యాలయం లో పొన్నాపురం. రైతు నగరం. ఉడుమాల్పురం. సచివాలయ సిబ్బంది తో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో కమిషనర్ రవి చంద్రా రెడ్డి. అసిస్టెంట్ కమిషనర్ వెంకట దాస్. ఎమ్ పీడీఓ భాస్కర్. ఆర్ ఓ వర ప్రసాద్. హెల్త్ ఆఫీసర్ అంకిరెడ్డి . టౌన్ ప్లానింగ్ అధికారి నరసింహ మూర్తి తదితరులు పాల్గొన్నారు. రాష్ట్ర మున్సిపల్ అధికారుల ఆదేశాల మేరకు మరియు కలెక్టర్ గారి ఆదేశాల మేరకు గత 2020 సంవత్సరం లోనే మున్సిపాలిటీ యందు కలపడం జరిగిందన్నారు. కొన్ని అని వారణ కారణవల్ల లేటయిందని తెలిపారు . రైతు నగరం. పొన్నాపురం. ఉడుమాల్పురం. నంద్యాల మున్సిపాలిటీ లో మెర్జ్ అయ్యాయని . కావున సచివాలయ సిబ్బంది మున్సిపల్ పరిధిలోకి వస్తారని . ఈ ఐదు సచివాలయ సిబ్బంది మున్సిపల్ అధికారుల ఆదేశాలు మేరకు నడుచుకోవాలని అన్నారు . పట్టణంలో ఉన్న సచివాలయ సిబ్బంది ఎలా పనిచేస్తున్నారో మీరు కూడా అలాగే చేయాలని సూచించారు

## నేడు శ్రీ మద్దులేటి లక్ష్మీ నృసింహా స్వామి జన్మ నక్షత్రం,,

నంద్యాల నంద్యాల తెలుగు పేటలో వెలచిన శ్రీ లక్ష్మీ నృసింహ స్వామి దేవాలయం యందు . 10వ తేదీన శుక్రవారం శ్రీ నృసింహా స్వామి వారి జన్మ నక్షత్రం స్వాతి నక్షత్రం పురస్కరించుకుని ఆలయం లో ఉదయం 6గం లకు మూలమూర్తి శ్రీ మద్దులేటి లక్ష్మీ నృసింహా స్వామి వారి కి పంచామృత అభిషేకం మరియు స్నపన తిరుమంజనం నిర్వహించడం జరుగుతుందని అలయ కమిటీ సభ్యులు తెలిపారు , తదుపరి ఉత్సవ మూర్తి శ్రీ లక్ష్మీ నృసింహా స్వామి వారి కి పంచామృత అభిషేకం మరియు స్నపన తిరుమంజనం నిర్వహించడం జరుగుతుందన్నారు .

# నేడు మండల సర్వసభ్య సమావేశం...

**ఎంపీడీవో మహబూబ్ బాషా**

తుగ్గలి శుక్రవారం రోజున మండల కేంద్రమైన తుగ్గలిలోని స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం నందు ఎంపీపీ అనుమరాజు ఆదెమ్మ ఆధ్వర్యంలో ఉదయం 11 స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం నందు సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు తుగ్గలి ఎంపీడీవో మహబూబ్ బాషా తెలియజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత మూడు నెలల పాటు చేపట్టిన సంక్షేమ పథకాల గురించి మరియు చేపట్టబోయే సంక్షేమ పథకాలు గురించి నివేదికలు తయారు చేసుకుని సమావేశానికి హాజరుకావాలని ఆయన తెలియజేశారు.ఈ కార్యక్రమానికి సర్పంచులు,ఎంపీటీసీలు మరియు ప్రజా ప్రతినిధులు తప్పకుండా హాజరుకావాలని తెలియజేశారు.మూడు నెలలకు ఒకసారి నిర్వహించే మండల సర్వసభ్య సమావేశానికి అన్ని శాఖల మండల స్థాయి అధికారులు తప్పకుండా హాజరుకావాలని,హాజరు కాని వారిపై తగిన చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో మహబూబ్ బాషా తెలియజేశారు.

# ఎన్నికల ముందు ఈడీ వస్తది

న్యూఢిల్లీ ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో ఈడీ కి పూర్తిగా సహకరిస్తానని ఎమ్మెల్సీ కవిత అన్నారు. గురువారం ఆమె ఢిల్లీలో మీడియాతో మాట్లాడారు. ఇలాంటి కేసుల్లో మహిళలను ఇంట్లోనే విచారిస్తారని గుర్తు చేశారు. కుదరక పోతే వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అయినా విచారిస్తారని తెలిపారు. కానీ కావాలనే తనను ఢిల్లీకి పిలిచారని..2023, మార్చి11వ తేదీన ఉదయం 11న ఈడీ విచారణకు హాజరవుతానని ఎమ్మెల్సీ కవిత స్పష్టం చేశారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం తమను ఇబ్బంది పెట్టేందుకే ఈడీని ప్రయోగిస్తోందని ఎమ్మెల్సీ కవిత ఆరోపించారు. ఎన్నికలు ఎక్కడుంటే అక్కడికి మోడీ కంటే ముందు ఈడీ వస్తోందన్నారు.

# డోన్ ప్రభుత్వాసుపత్రిలో నెఫ్రాలజిస్టు వైద్యున్ని ఏర్పాటు చేయాలి

ప్యాపిలి నంద్యాల అంతర్జాతీయ కిడ్నీ దినోత్సవ సందర్భంగా జిల్లా వినియోగదారుల రక్షణ సంఘం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఏఈ నాగరాజు పత్రిక విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అంతర్జాతీయ కిడ్నీ దినోత్సవం పురస్కరించుకొని ప్రభుత్వ ఆసుపత్రిలో కిడ్నీ వ్యాధికి చికిత్స చేసేందుకు వైద్యులు లేకపోవడం వల్ల కర్నూలు నంద్యాలకు వెళ్ళవలసి వస్తుందన్నారు కిడ్నీ వ్యాధిగ్రస్తులకు వారంలో రెండుసార్లు డయాసిస్ చేయించుకోవాల్సి ఉంది డోన్ పట్టణంలో కిడ్నీ వ్యాధిగ్రస్తులకు చికిత్స చేసేందుకు వైద్యులు లేనందున బాధితులను కర్నూలు నంద్యాల ప్రాంతాలకు ఆటోలో వెళ్లాలంటే చార్జీలు 5000 రూ ఖర్చువుతుంది ఇలా ప్రతి నెల రెండుసార్లు డయాలసిస్ చేయవలసి ఉంటుంది ప్రతి నెలకు 20 వేల రూపాయలు కిడ్నీ పేషెంట్ కు ఖర్చువుతుంది డోన్ డివిజన్ నందు దాదాపుగా 470 మంది కిడ్నీ పేషెంట్లు ఉన్నారు వీరందరూ కొంతమంది పోలేక అనారోగ్యానికి గురై చనిపోతున్నారు అదేవిధంగా బ్లడ్ బ్యాంకు కూడా ఏర్పాటు చేయాలని పలుమార్లు జిల్లా కలెక్టర్లకు దరఖాస్తులు ఇవ్వడం జరిగినది ఇక్కడ ప్రభుత్వ ఆసుపత్రిలో ఎక్స్రే లేనందువల్ల కాళ్ళు చేతులు విరిగిన బాధితులు ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్తే సుమారు 500 రూపాయలు తీసుకొని చికిత్సలు అందిస్తున్నారు ప్రభుత్వ ఆసుపత్రులు మాత్రం సాంకేతిక లోపం ఉన్నందువల్ల మిషనరీస్ పనిచేయడం లేదని జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేయని మిషినరిని రిపేరు చేయించి రోగులకు అందుబాటులోకి తేవాలని ఏఈ నాగరాజు డిమాండ్ చేశారు ఈ విషయంపై ప్రజాసంఘాల నాయకులు వామపక్షాల నాయకులు సామాజిక సేవా సంఘాల ప్రతినిధులు పోరాటం చేసి బాధితులకు (రోగులకు) సహాయం చేయాలని ఒక ప్రకటన కోరుతున్నాం ఈ కార్యక్రమంలో డోన్ తాలూకా వినియోగదారుల రక్షణ సంఘం అధ్యక్షులు మస్తానయ్య సలహాదారులు మల్లికార్జున అయ్యా కార్యవర్గ సభ్యులు సిద్ధయ్య వడ్డెర సుజాతమ్మ చాముండేశ్వరి,సూర్య, పద్మావతి,సోమన్న గౌడ్, తలారి విజయుడు,చిన్న నాగరాజు యాదవ్,మాధవి లత, ఏసుదాసు, తదితరులు పాల్గొన్నారు

# అల్లు అర్జున్ తో సాయి పల్లవి.. అసలు విషయం ఇది!



పుష్ప సినిమా తర్వాత అప్పటివరకు స్టైలిష్ స్టార్ గా ఉన్న అల్లు అర్జున్ ఐకాన్ స్టార్ గా కొత్త అవతారం ఎత్తాడు. ఈ సినిమా కేవలం తెలుగు తమిళ కన్నడ మలయాళం భాషల్లోనే కాదు హిందీలో కూడా సూపర్ గా ఆడడమే కాదు... వసూళ్ల వర్షం కూడా కురిపించడంతో ఇప్పుడు అల్లు అర్జున్ సంబందించిన అన్ని విషయాల మీద దేశవ్యాప్తంగా ఉన్న అభిమానుల దృష్టి ఉంటుంది.ఈ నేపథ్యంలోనే ఆయన పుష్ప 2 సినిమాతో మరోసారి ప్లాన్ ఇండియా లెవెల్లో హిట్టు కొట్టేందుకు సిద్ధమవుతున్నాడు. సుకుమార్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ రెండో భాగం మీద భారీ అంచనాలు ఏర్పడుతున్నాయి. మొదటి భాగాన్ని మించి రెండో భాగాన్ని తెరకెక్కించే విధంగా ప్లాన్ చేస్తున్నట్లుగా అనేక ప్రచారాలు అయితే జరుగుతున్నాయి. అంతేకాక రెండో భాగంలో కొత్త నటీనటులను కూడా తీసుకోబోతున్నారు అనే ప్రచారం జరుగుతోంది. ఇక తాజాగా ఈ సినిమాలో అల్లు అర్జున్ సరసన రష్మిక మందన్న తో పాటు సాయి పల్లవి కూడా నటించే అవకాశం ఉందని పెద్ద ఎత్తున ప్రచారం మొదలైంది.ఆమెకు లేడీ పవర్ స్టార్ అనే బిరుదు కూడా ఈ మధ్యనే రావడంతో ఐకాన్ స్టార్తో లేడీ పవర్ స్టార్ నటిస్తోంది... అంటూ పెద్ద ఎత్తున టాలీవుడ్ లో ప్రచారం మొదలైంది అయితే ఇవన్నీ ప్రచారాలే తప్ప ఇందులో నిజం ఏమీ లేదని తెలుస్తోంది. ఈ సినిమాలో సాయి పల్లవి హీరోయిన్ గా నటిస్తుందని వార్తలు ఎలాంటి నిజం లేదని కేవలం ఇదంతా ప్రచారం కోసం పుట్టించిన ఒక వార్త అని తెలుస్తోంది.ఈ విషయం మీద సినిమా యూనిట్ ఎలాంటి క్లారిటీ ఇవ్వలేదు కానీ... సాయి పల్లవి అసలు సినిమా యూనిట్ ను సంప్రదించలేదని తెలుస్తోంది. సుకుమార్ చాలా శ్రద్ధ పెట్టి చేస్తున్న ఈ రెండో భాగంలో కూడా రష్మిక మందన హీరోయిన్గా నటిస్తోంది. మైత్రి మూవీ మేకర్ సంస్థ భారీ బడ్జెట్ తో ఈ సినిమాని నిర్మిస్తోంది. సుకుమార్ కి సంబంధించిన నిర్మాణ సంస్థ ఈ రెండో భాగంలో నిర్మాణ భాగస్వామిగా వ్యవహరిస్తోంది.

# బాహుబలి అవంతిక పాత్ర కోసం తమన్నా కంటే ముందు రాశి ఖన్నా...!

టాలీవుడ్ జక్కన్న రాజమౌళి దర్శకత్వంలో ఒక చిన్న పాత్రను చేసినా చాలు అని ఎంతో మంది స్టార్స్ అనుకుంటూ ఉంటారు. వారిలో హీరోయిన్ రాశి ఖన్నా కూడా ఒకరు. తాజాగా ఒక ఇంటర్వ్యూలో రాశి ఖన్నా ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. రాజమౌళి దర్శకత్వంలో బాహుబలి సినిమా అవంతిక పాత్రలో నటించేందుకు రాశి ఖన్నా ఆడిషన్స్ కు వెళ్లిందట.అవంతిక పాత్ర కోసం ఆడిషన్స్ కు వెళ్లిన సమయంలో రాజమౌళి గారు చూసి మరీ క్యూట్ గా ఉన్నావు. లవ్ స్టోరీ అయితే బాగా సెట్ అవుతుంది.. తెలిసిన దర్శకుడు ఒక లవ్ స్టోరీని చేస్తున్నాడు.. స్టోరీ విను తప్పకుండా నీకు నచ్చుతుంది అన్నారు. అలా నాకు అవంతిక పాత్ర కోసం వెళ్తే ఊహలు గుసగుసలాడే సినిమాలో ఛాన్స్ వచ్చిందని రాశి ఖన్నా పేర్కొంది.మద్రాస్ కెఫె సినిమా తర్వాత బాహుబలి సినిమాలో నటించాలని ఆశ పడ్డ రాశి ఖన్నాకు రాజమౌళి కారణంగా ఊహలు గుసగుసలాడే సినిమా ఛాన్స్ దక్కింది. మొదటి సినిమాతోనే మంచి పేరు దక్కించుకున్న రాశి ఖన్నా గత పది సంవత్సరాలుగా టాలీవుడ్ లో సినిమాలు చేస్తూనే ఉంది.తెలుగు లో మాత్రమే కాకుండా తమిళం మరియు ఇతర భాషల్లో కూడా ఈ అమ్మడు సినిమాల్లో నటించి మెప్పించింది. ఇండస్ట్రీలో అడుగు పెట్టి ఇన్నాళ్లు అయినా కూడా పాపం రాశి ఖన్నాకు స్టార్ హీరోలకు జోడీగా నటించే అవకాశాలు మాత్రం చాలా తక్కువ దక్కాయి. ఇప్పటికి కూడా స్టార్ హీరోల సినిమాల్లో నటించేందుకు ఆసక్తిగా ఎదురు చూస్తోంది.బాహుబలి సినిమా లో అవంతిక పాత్ర కోసం ఎంతో మందిని పరిశీలించిన రాజమౌళి చివరకు తమన్నా తో ఆ పాత్రను చేయించడం జరిగింది. మిల్కీ బ్యూటీ తమన్నా బాహుబలి 1 లో ప్రాముఖ్యత ఉన్న పాత్ర లో కనిపించింది. కానీ బాహుబలి 2 లో మాత్రం ఆశించిన స్థాయిలో ప్రాముఖ్యత కలిగి లేదు. బాహుబలి 2 తర్వాత తమన్నా కెరీర్ లో కాస్త స్లో డౌన్ అయ్యిందని చెప్పాలి.



# చమ్కీల అంగీలేసి అంటూ వస్తున్న నాని..!

నేచురల్ స్టార్ నాని హీరోగా పాన్ ఇండియా స్థాయిలో వస్తున్న మూవీ దసరా. దక్షిణాది భాషలతో పాటు హిందీలోనూ విడుదలకానున్న ఈ మూవీలో నానికి జోడిగా కీర్తి సురేష్ నటిస్తోంది. సుకుమార్ శిష్యుడు శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో దసరా సినిమా పక్కా మాస్ మసాలా ఎంటర్ టైనర్ గా తెరకెక్కుతోంది. ఈ మూవీని శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర సినిమాస్ బ్యానర్ పై సుధాకర్ చెరుకూరి భారీగా బడ్జెట్ పెట్టి నిర్మిస్తున్నారు. సంతోష్ నారాయణ సంగీతం అందిస్తున్నారు.దసరా మూవీ నుండి ఒక్కో సాంగ్ విడుదల అవుతూ వస్తోంది. సాంగ్స్ పోస్టర్లు టీజర్లు దసరా మూవీపై అంచనాలు పెంచేస్తున్నాయి. ఈ క్రమంలోనే మూడో పాటను కూడా మూవీ మేకర్స్ విడుదల చేశారు. 'చమ్కీల అంగీలేసి' అంటూ సాగే గీతాన్ని మూవీ మేకర్స్ రిలీజ్ చేశారు.'చమ్కీల అంగీలేసి' అంటూ సాగే ఈ మెలోడియస్ సాంగ్ ను యూట్యూబ్ లో విడుదల చేశారు. ఈ పాటను రామ్ మిరియాల ధీ ఆలపించారు. కాసర్ల శ్యామ్ లిరిక్స్ అందించారు. హమ్ చేసుకోవడానికి వీలుగా ఉండేలా ఉన్న ఈ సాంగ్ దసరా మూవీకి మంచి క్రేజ్ తీసుకువచ్చేలా కనిపిస్తోంది. ఈ సాంగ్ కు విడుదలైన కొన్ని క్షణాల్లోని ఇబ్బడిముబ్బడిగా వ్యూస్ వచ్చిపడుతున్నాయి.ఇక ఈ సినిమాలో దీక్షిత్ శెట్టి సముద్రఖని సాయికుమార్ వంటి వారు కీలక పాత్రలో నటిస్తున్నారు. సత్యం సూర్య సినిమాటోగ్రఫీ నవీన్ నూలి ఎడిటింగ్ చేస్తున్నారు. మార్చి 30వ తేదీన దేశవ్యాప్తంగా విడుదల చేయనున్నారు.ఈ నేపథ్యంలో అని భాషల్లోనూ ప్రచారం చేసేందుకు మూవీ మేకర్స్ ప్లాన్ రెడీ చేసుకుంటున్నారు. ముంబయి లక్నోలో ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని భావిస్తున్నారు. దక్షిణాదితో పాటు ఉత్తర భారతంలో కూడా దసరా సినిమాపై బజ్ క్రియేట్ చేయాలని మూవీ మేకర్స్ అనుకుంటున్నారు. వీలైనంత మేరకు ప్రమోషన్స్ చేయాలని నిర్ణయించుకున్నారు.ఈమధ్యకాలంలో సంస్కృతి సాంప్రదాయాల చుట్టూ అల్లుకుని తెరకెక్కుతున్న సినిమాలకు హిందీ ప్రేక్షకులు బ్రహ్మరథం పడుతున్నారు. దసరా సినిమా కూడా కొంత పాజిటివ్ టాక్ దక్కించుకోగలిగితే ఈ సినిమా మంచి కలెక్షన్లు సాధించే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి.



# సన్‌రైజర్స్‌కు బ్యాడ్ న్యూస్.. కొత్త కెప్టెన్ దూరం! సారథిగా భువీ



ఐపీఎల్-2023 సీజన్ ప్రారంభానికి ముందు ఆయా ఫ్రాంచైజీలకు ఓ బ్యాడ్ న్యూస్. దక్షిణాఫ్రికా స్టార్ ఆటగాళ్లు ఈ ఏడాది సీజన్ ప్రారంభ మ్యాచ్‌ల్లో ఆడే అవకాశాలు కనిపించడం లేదు.దక్షిణాఫ్రికా జట్టు స్వదేశంలో మార్చి 31 నుంచి ఏప్రిల్ 2వ తేదీ వరకు నెదర్లాండ్స్‌తో రెండు మ్యాచ్‌ల రీ షెడ్యూల్ వన్డే సిరీస్ ఆడనుండడమే దీనికి కారణం. కాగా ఈ సిరీస్‌లో తమ జట్టు స్టార్ ఆటగాళ్లను భాగం చేయాలని దక్షిణాఫ్రికా క్రికెట్ భావిస్తున్నట్లు తెలుస్తోంది.ఇక ఇప్పటికే తమ నిర్ణయాన్ని దక్షిణాఫ్రికా క్రికెట్ బీసీసీఐకి కూడా తెలియజేసినట్లు సమాచారం. ఇక ఐపీఎల్ ఫ్రాంచైజీలతో కాంట్రాక్టు కల్గి ఉన్న కగిసో రబడ, లుంగి ఎంగిడీ, రాస్సీ వాన్ డెర్ డ్యూసెన్, డేవిడ్ మిల్లర్, క్వింటన్ డి కాక్, ఐడెన్ మార్క్‌రమ్, స్టాబ్స్, మార్కో జాన్సెన్, క్లాసన్ వంటి ప్రోటీస్ ఆటగాళ్లు నెదర్లాండ్స్‌తో వన్డే సిరీస్‌లో భాగమయ్యే ఛాన్స్ ఉంది.తొలి మ్యాచ్‌కు మార్క్‌రమ్ దూరం.. కెప్టెన్‌గా భువీకాగా ప్రోటీస్ స్టార్ బ్యాటర్ ఐడెన్ మార్క్‌రమ్ సన్‌రైజర్స్ హైదరాబాద్ కెప్టెన్‌గా ఎంపికైన సంగతి తెలిసిందే. ఈ ఏడాది సీజన్ నుంచే ఎస్ఆర్‌హెచ్ సారథిగా మార్క్‌రమ్ తన ప్రయాణాన్ని ఆరంభించనున్నాడు. ఈ ఏడాది సీజన్‌లో ఎస్ఆర్‌హెచ్ తమ తొలి మ్యాచ్‌లో ఏప్రిల్2న రాజస్తాన్ రాయల్స్‌తో తలపడనుంది. ఈ మ్యాచ్‌కు మార్క్‌రమ్ దూరం కావడం దాదాపు ఖాయంగా కన్పిస్తోంది.ఈ మ్యాచ్‌లో? ఎస్ఆర్‌హెచ్ కెప్టెన్‌గా వెటరన్ పేసర్ భువనేశ్వర్ కుమార్ వ్యవహరించే అవకాశం ఉంది. అనంతరం సన్‌రైజర్స్ రెండో మ్యాచ్‌కు మార్క్‌రామ్ జట్టుతో కలిసే అవకాశం ఉంది. ఇక ఐపీఎల్ 2023 మార్చి 31 నుంచి ప్రారంభం కానుంది.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL - 518 001. ANDHRA PRADESH.**
**PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**